ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
5
బుధవారం • 1 మే 2024

న్యూస్‌మేకర్



ఇన్నేళ్లుగా తనకు తాను కొన్ని పరిమితులు విధించుకున్న సునీత... భర్త అరెస్టుతో నాటకీయ పరిణామాల మధ్య హఠాత్తుగా భారీ సభలో ప్రత్యక్షమయ్యారు. అయితే ఈసారి ఢిల్లీ ప్రజల ముందుకు వచ్చింది 2015లో నాటి సునీత కాదు... అచంచల ఆత్మవిశ్వాసం, పోరాటస్ఫూర్తి గల సునీత.

సునీత కేజ్రీవాల్

అది 2015... ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంచలన విజయం సాధించిన సందర్భం. పార్టీ కార్యాలయంలో సంబరాలు మిన్నంటిన వేళ... వేదికపై 'ఆప్' అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఘనంగా ఎంట్రీ ఇచ్చారు. పక్కనే ఉన్న తన సహధర్మచారిణి **సునీత కేజ్రీవాల్** భుజంపై చేయి వేసి... 'ఈమె నా సహధర్మచారిణి. ఇప్పటివరకు మీ ముందుకు రాలేదు' అంటూ గొప్పగా పరిచయం చేశారు. నాడు ఎంతో బిడియంగా... బెరుగ్గా కనిపించిన 58 ఏళ్ల సునీత... నేడు లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన భర్తకు అండగా నిలిచి... పరిణతి చెందిన రాజకీయ నాయకురాలిగా పార్టీని ముందుండి నడిపిస్తున్నారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఆ స్థానాన్ని భర్తీ చేసేది ఎవరనేదానిపై చర్చ మొదలైంది. ఆ సమయంలో అందరి దృష్టి సునీతా కేజ్రీవాల్ పైకి మళ్లింది. దానికి కారణం... అవినీతిపై పోరాటం నుంచి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడం వరకు కేజ్రీవాల్ ప్రతి అడుగులో ఆమె భాగం పంచుకోవడమే. 'జైలు నుంచే పరిపాలిస్తా' అంటూ కేజ్రీవాల్ ప్రకటించడం వెనుక బహుశా తనకు అండగా సునీత ఉందన్న ధైర్యం కావచ్చు. ఆవిడ సామర్థ్యంపై నమ్మకం కావచ్చు. నాడు 2015లో మొదటిసారి 'నా భార్య సునీత' అని గర్వంగా పరిచయం చేసిన కేజ్రీవాల్ అదే వేదికపై... "ప్రభుత్వ ఉద్యోగి అయినందున తనపై చర్యలు తీసుకొంటారేమోనని తను ఎప్పుడూ భయపడుతూ ఉండేది. ఇవాళ తనకు చెప్పాను... 'ఇకపై నువ్వు భయపడాల్సిన అవసరం లేదని. ఆమె లేకపోతే నేను ఏదీ సాధించగలిగేవాడిని కాదు. ప్రతి సందర్భంలోనూ నాకు తోడుగా ఉన్నందుకు ధన్యవాదాలు సునీత" అంటూ భావోద్వేగంగా చెప్పారు. అప్పటికి సునీత ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్) అధికారిగా కొనసాగుతున్నారు.

ఇంటి బాధ్యతలు భుజానికెత్తుకొని...

ముస్సోరీ సివిల్ సర్వీస్ అకాడమీ(1993)లో కేజ్రీవాల్, సునీత మొదటిసారి కలిశారు. కొన్నాళ్ల స్నేహం తరువాత ఒక రోజు కేజ్రీవాల్ వెళ్లి సునీత తలుపు తట్టారు. 'నన్ను పెళ్లి చేసుకొంటావా' అని అడిగారు. ఆమె అంగీకారంతో నవంబర్ 1994లో ఇద్దరూ జంటగా మారారు. ఐఆర్ఎస్ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసి అరవింద్ కేజ్రీవాల్ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగం కావడం, ఆ తరువాత రాజకీయాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో ఇంటి బాధ్యతలను సునీత తన భుజాలపై వేసుకున్నారు. అత్తమామలు, ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూసుకున్నారు. ఆర్థికంగానూ కుటుంబానికి అండగా నిలబడ్డారు. కేజ్రీవాల్ కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి ఎప్పుడూ భంగం కలగనివ్వలేదు. మీడియా దృష్టి ఆమెపై పడకుండా జాగ్రత్త పడ్డారు.

భర్త ఆరోగ్యమే ప్రధానం...

కేజ్రీవాల్ మొదటిసారి సీఎం అయిన మరుసటి ఏడాది సునీత స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఉద్యోగం వదిలేసే నాటికి ఆమె ఇన్‌కమ్‌ట్యాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ కమిషనర్. పదవీ విరమణ తరువాత సునీత దృష్టి పెట్టింది భర్త రాజకీయాలపై కాదు... ఆయన ఆరోగ్యంపై. ఢిల్లీ, ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో క్షణం తీరిక లేకుండా తిరుగుతున్న కేజ్రీవాల్... సమయానికి తింటున్నారా? రెగ్యులర్‌గా డయాబెటిక్ ఇన్సులిన్ తీసుకొంటున్నారా? అనే విషయాలపై ఎంతో ఆందోళన చెందారు. ఆయన వెన్నంటి వేళకు అన్నీ చూసుకున్నారు. ఆయనకు రక్షణ గోడలా నిలిచారు. అప్పుడే కాదు... పెళ్లి నాటి నుంచి సునీత రోజువారీ పనుల్లో భర్త ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూవస్తున్నారు.

'జెయిల్ కా జవాబ్ ఓట్ సే'



ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సునీత ప్రచార రథం ఎక్కారు. జైల్లో ఉన్న కేజ్రీవాల్... ఎన్నికల లోగా బయటకు వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో ఆమే కార్యక్షేత్రంలోకి దిగారు. 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' (జైలుకు జవాబు ఓటే) అంటూ సాగే పాటతో ఆమె భారీ రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. వీటికి జనం నుంచి విశేష స్పందన రావడం పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. అయితే 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' పాటను ఎన్నికల సంఘం నిషేధించింది. ఏదిఏమైనా విద్యావంతురాలు కావడం, హిందీ, ఇంగ్లీష్‌ల్లో అనర్గళంగా మాట్లాడగలగడం సునీతకు బాగా కలిసొచ్చింది. సూటిగా, సుత్తి లేకుండా సాగే ఆమె ప్రసంగాలు కేజ్రీవాల్ లేని లోటును కొంతవరకైనా భర్తీ చేయగలవని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఒక్క ఢిల్లీలోనే కాకుండా పంజాబ్, గుజరాత్, హరియాణాల్లో కూడా సునీత ప్రచారానికి రంగం సిద్ధం చేసింది 'ఆప్'.

ప్రచార బాధ్యతలు...

అప్పటివరకు తెర వెనకే ఉన్న సునీత 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బయటకు వచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ ఇతర నియోజకవర్గాల్లోని పార్టీ అభ్యర్థుల ప్రచారంలో బిజీగా ఉంటే... ఆయన బరిలో దిగిన ఢిల్లీలో ప్రచార బాధ్యతలను సునీత తీసుకున్నారు. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి మహిళలను ప్రత్యేకంగా కలిశారు. వారికి 'ఆప్' ఇచ్చిన హామీలను వివరించి చెప్పారు. నిన్నటి వరకు సామాజిక మాధ్యమాల్లో సునీత పోస్టులన్నీ ఢిల్లీ, పంజాబ్‌ల్లోని 'ఆప్' ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు, చేసిన పనుల గురించే ఉండేవి. లేదంటే పార్టీ, ప్రభుత్వం ప్రకటనల రీపోస్ట్‌ల ప్రకటనలకే పరిమితమయ్యారు. అంతకుమించి ఆప్, బీజేపీ మధ్య జరుగుతున్న రాజకీయ యుద్ధంలో కానీ, ఎన్డీఏ నడుపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కానీ స్పందించకూడదని నియమంగా పెట్టుకున్నారు. అయితే ఒకే ఒక్క సందర్భం (2018)లో అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను విమర్శించారు. అదికూడా ఓ స్కామ్‌కు సంబంధించి తన సోదరి, కుటుంబాన్ని వేధించిన విషయంలో.

కేజ్రీవాల్ అరెస్టుతో...

ఇన్నేళ్లుగా తనకు తాను కొన్ని పరిమితులు విధించుకున్న సునీత... భర్త అరెస్టుతో నాటకీయ పరిణామాల మధ్య హఠాత్తుగా భారీ సభలో ప్రత్యక్షమయ్యారు. అయితే ఢిల్లీ ప్రజల ముందుకు వచ్చింది 2015లో సునీత కాదు... అచంచల ఆత్మవిశ్వాసం, పోరాటస్ఫూర్తి గల సునీత. కిక్కిరిసిన ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో... 'ఇండియా' కూటమి నిర్వహించిన భారీ ర్యాలీని ఉద్దేశించి ఆమె గళం విప్పారు. జైలు నుంచి కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఆ తరువాత... 'మన ప్రధాని మోదీ నా భర్తను జైల్లో పెట్టారు. ప్రధాని చర్య సరైనదేనా? జైల్లో ఉన్నారు కనుక కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు అంటున్నారు. మరి ఆయన రాజీనామా చేయాలా? మీ కేజ్రీవాల్ సింహంలాంటివారు. ఆయన్ను వీళ్లు ఎంతో కాలం జైల్లో ఉంచలేరు' అంటూ సునీత తనదైన శైలిలో ప్రసంగించారు.

ప్రజల మద్దతు కూడగట్టేందుకు...

ఆ ప్రసంగం తరువాత ఢిల్లీ ప్రజలను ఉద్దేశించి సునీత మూడు వీడియో సందేశాలు కూడా విడుదల చేశారు. అందులో తన భర్త అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ప్రజల కొడుకుగా, పెద్దన్నగా అభివర్ణించే ప్రయత్నం చేశారు. కేజ్రీవాల్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ తరుఫున మరొక వీడియో సందేశం వదిలారు.

తద్వారా ప్రజలు తమ పార్టీకి భావోద్వేగాల పరంగానూ కనెక్ట్ అవ్వాలన్నది ఆమె ఆలోచన. ఒకవేళ కేజ్రీవాల్ ఎక్కువ కాలం జైల్లోనే గడపాల్సి వస్తే... సీఎం కుర్చీలో సునీతను కూర్చోబెట్టడానికి రంగం సిద్ధమవుతుందన్న ఊహాగానాలు కూడా ఊపందుకున్నాయి. అయితే ఈ ఊహాగానాలను ఆప్ నాయకులు ఖండించారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరిని తీసుకువచ్చే ఆలోచనేదీ లేదని తేల్చి చెప్పారు. 2020లో ఆప్ విజయం తరువాత 'మీకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఉందా అని' ఓ ఆంగ్ల పత్రిక అడిగిన ప్రశ్నకు... 'ఆప్ తీసుకొనే ఎలాంటి నిర్ణయాల్లోనూ నేను జోక్యం చేసుకోను. కేవలం నా భర్తకు సహకారం అందిస్తాను' అంటూ చెప్పుకొచ్చారు. ఇన్నాళ్లూ భర్తకు నీడలా ఉన్న ఆమె... ఇప్పుడు ముందుకు వచ్చి ఆయనకు మద్దతుగా ప్రజలను ఏకం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

శరీరం గట్టిగా..

ఎండాకాలం అనగానే పుచ్చకాయలు గుర్తొస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల పుచ్చకాయలు ఉన్నాయి. శరీరానికి చల్లదనం కూడా చేకూర్చే ఈ సమ్మర్ ఫ్రూట్ ఉపయోగాలివే..

- వాటర్‌మెలన్‌లో 90 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడుతుంది.
- ఇందులో ఫైబర్ ఉండటం వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. దీంతో పాటు బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండును మెనూలో ఉంచుకోవాల్సిందే.
- విటమిన్- సి పుష్కలం. దీనివల్ల చర్మం, జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది.



- ఎ- విటమిన్ ఉండటం వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. పొటాషియం ఉండటం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. త్వరగా నీరసం రాదు. గుండె ఆరోగ్యానికి మంచిది.
- రక్తంలోని చక్కెరశాతం పెరగకుండా కాపాడుతుంది. ముఖ్యంగా ఎండాకాలంలో వడదెబ్బ బారిన నుంచి పుచ్చకాయ పండు రక్షిస్తుంది.
- మలబద్ధకంతో బాధపడేవాళ్లు, మూత్రం మంటగా వస్తున్నప్పుడు.. ఈ పుచ్చకాయ పండు లేదా రసం తాగితే ఉపశమనం లభిస్తుంది. బ్లడ్ ప్రెషర్‌ను నియంత్రిస్తుంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oCMqVEPలో చదవండి.

ఫ్యాషన్







స్టైలిష్‌గా, ఫ్యాషన్‌గా కనిపిస్తూ, అంతే సమానంగా సౌకర్యంగా ఉండే డ్రస్సుల్లో షార్ట్ డ్రస్ ఒకటి. అటు క్యాజువల్ వేర్‌గా ఇటు ఈవెనింగ్ వేర్‌గా ఉపయోగపడే షార్ట్ గౌన్స్ ధరించడంలో చిట్కాలు తెలుసుకుందామా..!

ముద్దొచ్చే షార్ట్ గౌన్స్

సందర్భాన్ని బట్టి...

కాటన్, షిఫాన్, జార్జెట్... ఇలా ఎన్నో రకాల మెటీరియల్స్‌తో తయారయ్యే షార్ట్ డ్రస్‌లను సందర్భాన్ని బట్టి ఎంచుకుంటూ ఉండాలి. పార్టీ వేర్‌గా ధరించాలనుకుంటే జార్జెట్, శాటిన్‌తో తయారైన షార్ట్ డ్రస్ ఎంచుకోవాలి. డైలీవేర్ కోసం ప్యూర్ కాటన్, కలంకారీ, గాబు ప్రింటెడ్ డ్రస్‌లు బాగుంటాయి. కనిపించాలనుకునే లుక్‌ను బట్టి ఈ డ్రస్‌లను సొంతగా డిజైన్ చేయించుకోవచ్చు. స్లీవ్‌లెస్, బోట్‌నెక్ షార్ట్ డ్రస్‌లు డైలీ వేర్‌గా, నడుముకు బెల్ట్, ఛాతీ దగ్గర వర్క్ ఉన్న డ్రస్‌లను ఈవినింగ్ వేర్‌గా వేసుకోవచ్చు.

యాక్సెసరీస్

శాండిల్స్, హైహీల్స్, బూట్స్... ఎలాంటివైనా షార్ట్ డ్రస్‌కు సూటవుతాయి. రెట్టింపు స్టైలిష్‌గా కనిపించాలనుకుంటే హైహీల్స్, బూట్స్ వేసుకోవచ్చు. వెడ్జెస్, స్పోర్ట్స్ షూతో కూడా ఈ డ్రస్‌ను మ్యాచ్ చేయవచ్చు. క్యాజువల్‌గా కనిపించాలనుకుంటే లోఫర్స్ వేసుకోవచ్చు. కలర్‌ఫుల్‌గా కనిపించే ఫ్లాట్స్ కూడా ఈ డ్రస్‌కు మ్యాచ్ అవుతాయి.

జ్యువెలరీ

పొడవాటి స్ట్రాప్ ఉండే హ్యాండ్ బ్యాగ్, టోట్స్ ఈ రకం డ్రస్‌లకు మ్యాచ్ అవుతాయి. మెడలో ఎలాంటి జ్యువెలరీ ధరించకుండా ఉంటేనే ఈ డ్రస్‌లో ఫ్యాషనబుల్‌గా కనిపిస్తారు. పొడవాటి హ్యాంగింగ్స్, చేతికి బ్రేస్‌లెట్ బాగుంటాయి. డార్క్ కలర్ లిప్‌స్టిక్స్ షాడోలతో మ్యాచ్ చేస్తే, షార్ట్ డ్రస్‌లో అట్రాక్టివ్‌గా కనిపించవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

ఇళయరాజాను అవమానిస్తారా?

గంగై అమరన్ ఆగ్రహం



'సంగీత దర్శకుడు ఇళయరాజా గురించి ఇకపై అవాకులు చెవాకులు పేలితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ తమిళ సినీ గేయ రచయిత వైరముత్తును ఇళయరాజా సోదరుడు, సంగీత దర్శకుడు గంగై అమరన్ హెచ్చరించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఇళయరాజా సంగీతమే గొప్పదని, ఆ సంగీతాన్ని సమకూర్చిన వ్యక్తికే పాటలు కూడా సొంతమని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు ఇటీవల చెన్నైలో జరిగిన ఆడియో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒక పాటలో సంగీతం గొప్పదా? భాష గొప్పదా? అనేది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారిందని, సంగీతం ఎంత గొప్పదో భాష కూడా అంతే గొప్పదని, ఈ రెండూ కలిస్తేనే పాటగా మారుతుందని, ఈ విషయాన్ని గ్రహించి అర్థం చేసుకున్న వారే జ్ఞానులని అభిప్రాయపడ్డారు. జ్ఞాని అన్న మాట ఇళయరాజాకు వర్తించే విధంగా ఉందంటూ సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన గంగై అమరన్, వైరముత్తుపై మండిపడ్డారు. ఇళయరాజా గురించి వ్యాఖ్యానించడం ఇంతటితో మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని గంగై అమరన్ హెచ్చరించారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

నవీన్‌చంద్రకు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం



టాలీవుడ్ హీరో నవీన్‌చంద్రకు అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం జరిగిన ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో నవీన్‌చంద్ర ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. గత ఏడాది విడుదలైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ చిత్రం 'మంత్ ఆఫ్ మధు' చిత్రంలో అద్భుతమైన నటనకు గాను ఈ పురస్కారం ఆయనకు దక్కింది. ప్రస్తుతం నవీన్‌చంద్ర రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.

యాక్షన్ ఎంటర్టైనర్



'బేబీ'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటిస్తున్న చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. మే 31న ఈ సినిమా విడుదల కానుంది. సరికొత్త కంటెంట్‌తో ఈ చిత్రం రాబోతోందని పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తప్పకుండా ఆదరించాలి



'సగిలేటి కథ' మూవీ ఫేమ్ రవితేజ మహాదాస్యం ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. మద్దుల మదన్‌కుమార్ దర్శకత్వం వహించగా, సౌజన్య కావూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ఇటీవలే ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో రవితేజ మహాదాస్యంపై విరాజ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ "సినీ రంగంలోకి ఎంతో మంది ప్రతిభావంతులు వస్తున్నారు. వారిని తప్పకుండా ఆదరించాలి" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: అఖిల్ దేశ్‌పాండే, కెమెరామెన్ నితిన్ రెడ్డి చిమ్ముల, సహ నిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

జీవిత అనుభవాన్ని పంచుకొనేలా ఉంటుంది



'అల్లరి' నరేశ్ హీరోగా రూపొందిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంభాషణలు అందించిన అబ్బూరి రవి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'ఉద్యోగం రావడం, పెళ్లి కావడం.. ఇవే లైఫ్‌లో సెటిల్ అవడం అంటే. కానీ పెళ్లి విషయంలో ఇప్పటి యువత దృక్పథం మారిపోతోంది. పెళ్లి చేసుకుంటారో లేదో కూడా తెలియడం లేదు. అందుకే ఈ సీరియస్ సమస్యను వినోదభరితంగా 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రంలో చెప్పాం. ప్రత్యేకంగా సందేశం ఏమీ ఇవ్వలేదు కానీ ఓ జీవిత అనుభవాన్ని పంచుకొనేలా, ఆలోచింపజేసే విధంగా ఉంటుంది. అన్నారు.

సినిమాలో సిట్యువేషనల్ కామెడీతో పాటు ఎమోషన్ కూడా ఉందని చెబుతూ 'కంటెంట్‌లో మేటర్ ఉంటే అద్భుతమైన కామెడీ రాయవచ్చు. ఇందులో నరేశ్, జామీ లివర్ మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు నవ్విస్తాయి. పెళ్లి కాని ప్రతి ఒక్కరూ కోరుకొనే కంటెంట్ ఉన్న క్లీన్ ఎంటర్‌టైనర్ ఇది' అని రవి చెప్పారు.

'ఒక దర్శకుడు హీరోకి, నిర్మాతకు కథ చెప్పి ఒప్పిస్తాడు. అంటే తను ప్రూవ్ చేసుకున్నట్లే. ఎవరొచ్చినా నేను ఒక మాట చెబుతా.. మనిద్దరి మధ్య ఒక కథ ఉంది. దానికి ఎటువంటి న్యాయం చేయాలో చర్చిద్దాం. అని. కొత్త పాత అనే తేడా నాకు ఉండదు. ఏ దర్శకుడితోనైనా పని చేసే విధానం ఒక్కటే. దర్శకుడు తీసుకొచ్చిన కథని ఎంత గొప్పగా చెప్పాలన్నదే ఆలోచిస్తా' అన్నారు. చిత్ర పరిశ్రమంలో తన ఇరవై ఏళ్ల జర్నీ గురించి చెబుతూ 'ఎన్ని సినిమాలు రాశానో నాకు తెలీదు కానీ ఈ జర్నీ బాగుంది' అన్నారు. ప్రస్తుతానికి నటన మీద దృష్టి లేదనీ, దర్శకత్వం చేయాలనే ఆలోచన ఉందనీ, ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాననీ అబ్బూరి రవి చెప్పారు.

పర్ఫెక్ట్ కామెడీ ఎంటర్టైనర్



హిట్ సినిమా టైటిల్‌ను వాడుకుంటూ ఈ మధ్య సినిమాలు వరుసగా వస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవలోకి లేటెస్ట్‌గా 'బ్రహ్మచారి' చిత్రం చేరింది. ఏఎన్నార్, కమల్‌హాసన్ నటించిన చిత్రాల టైటిల్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో గుంట మల్లేశం కథానాయకుడిగా నటించారు. నర్సింగ్ దర్శకత్వం వహించగా, రామ్ భూపాల్‌రెడ్డి నిర్మించారు. తెలంగాణ యాసలో వస్తున్న ఈ పర్ఫెక్ట్ కామెడీ ఎంటర్టైనర్ మే 10న విడుదలవుతోంది. సోమవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించిన సందర్భంగా నిర్మాత రామ్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా కథ చాలా నాచురల్‌గా అనిపించింది" అని అన్నారు. డైరెక్టర్ నర్సింగ్ మాట్లాడుతూ "ఎంతో కష్టపడి ఈ సినిమా తీశాం. అందరూ ఆదరించాలని కోరుతున్నా" అని చెప్పారు. హీరో గుంట మల్లేశం మాట్లాడుతూ "ఇదొక సూపర్బ్ కామెడీ ఎంటర్టైనర్. థియేటర్స్‌లో ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సాయి ఆకులవిజయ్, సినిమాటోగ్రఫీ: కర్ణ ప్రియాసన్, సంగీతం: పాండురంగ, కో ప్రొడ్యూసర్: చిట్టిబాబు, హస్సాన్, జావిద్.

రాహుల్, శ్రేయాస్‌లపై వేటు
చాహల్, దూబేలకు చోటు

వికెట్ కీపర్లుగా పంత్, శాంసన్
హార్దిక్‌కు వైస్‌కెప్టెన్సీ
టీ20 వరల్డ్‌కప్‌నకు భారత జట్టు







న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో తలపడే భారత జట్టును జాతీయ సెలెక్టర్లు మంగళవారం ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ బృందానికి ఊహించినట్టుగానే రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే హార్దిక్ పాండ్యా ఎంపికపై కొంత సందేహాలు వ్యక్తమైనా.. తను బెర్త్ దక్కించుకోవడంతో పాటు జట్టు వైస్ కెప్టెన్సీ కూడా దక్కించుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఓడాక భారత జట్టులో మార్పుల కారణంగా రోహిత్, విరాట్ లేకుండానే ముందుకెళ్లారు. కానీ తిరిగి రోహిత్‌తో పాటు విరాట్ కోహ్లీ సైతం ఈ మెగా టోర్నీలో ఆడబోతుండడం గమనార్హం. ఓపెనర్‌గా యశస్వీ జైస్వాల్, మిడిలార్డర్‌లో విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా రానున్నారు. ఇక జూన్ ఒకటి నుంచి 29 వరకు వెస్టిండీస్, యూఎస్‌ఏలో ఈ మెగా టోర్నీ జరుగుతుంది. ఇందుకోసం భారత ఆటగాళ్లు విడతలవారీగా అమెరికా వెళ్లనున్నారు. కోచ్ ద్రవిడ్‌తో కలిసి తొలి బ్యాచ్ మే 21న బయలుదేరుతుంది.

రాహుల్‌కు నిరాశే..: జట్టులో స్టార్ ఆటగాడిగా కొనసాగుతున్న కేఎల్ రాహుల్‌పై ఆశ్చర్యకరంగా సెలెక్టర్లు వేటు వేశారు. ఐపీఎల్‌లో నిలకడగానే రాణిస్తున్నప్పటికీ అతడికి స్థానం దక్కలేదు అలాగే మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌ను సైతం విస్మరించారు. ఇక ఫినిషర్ రింకూ సింగ్, ఓపెనర్ గిల్ రిజర్వ్ ప్లేయర్లుగా ఉంటారు. ఇప్పటికే టీ20ల్లో భారత్ తరఫున ఆడిన తిలక్ వర్మ, ముకేశ్ కుమార్‌లకు నిరాశే ఎదురైంది. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను సైతం సెలెక్టర్లు పట్టించుకోలేదు.

రిషభ్.. 17 నెలల తర్వాత

వికెట్ కీపర్ రిషభ్ పంత్ సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులో ఆడబోతున్నాడు. 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురైన అతను తాజా ఐపీఎల్‌లో మెరుగ్గానే రాణిస్తున్నాడు. దీంతో వికెట్ కీపర్‌గా అతడితో పాటు సంజూ శాంసన్‌ను ఎంపిక చేశారు.ఇక, శాంసన్‌కిది తొలి వరల్డ్‌కప్. 2015లోనే జట్టులోకి వచ్చినా ఇప్పటికి 25 మ్యాచ్‌లే ఆడాడు. అలాగే స్పిన్నర్ చాహల్‌పై తిరిగి సెలెక్టర్లు నమ్మకముంచారు. గతేడాది ఆగస్టులో తన చివరి టీ20 మ్యాచ్ ఆడిన చాహల్ తాజా ఐపీఎల్‌లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. జడేజా, అక్షర్, కుల్దీప్ ఇతర స్పిన్నర్లుగా ఉన్నారు. అలాగే సీఎస్‌కే మిడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబేను సైతం పరిగణనలోకి తీసుకున్నారు. స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగే దూబే మెగా టోర్నీలో ఉపయోగపడగలడని సెలెక్టర్లు భావించడంతో రింకూకు బెర్త్ దక్కలేదు. పేస్ బాధ్యతలను బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్ తీసుకోనున్నారు.

ఇదే మన సైన్యం

బ్యాటర్లు:	రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కోహ్లీ, సూర్యకుమార్.
ఆల్‌రౌండర్లు:	హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.
వికెట్‌కీపర్లు:	రిషభ్ పంత్, సంజూ శాంసన్
బౌలర్లు:	అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్.
రిజర్వ్ ఆటగాళ్లు:	శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్.

భారత జట్టు గ్రూపు దశ మ్యాచ్‌లివే

ఎప్పుడు	ప్రత్యర్థి	వేదిక	సమయం
జూన్ 5	ఐర్లాండ్	న్యూయార్క్	రా. 7.30 గం.
జూన్ 9	పాకిస్తాన్	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 12	అమెరికా	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 15	కెనడా	లాడర్‌హిల్	రా.8 గం.

ఉబెర్ కప్‌లో అమ్మాయిలకు ఓటమి

చెంగ్డూ (చైనా): ఉబెర్ కప్ గ్రూప్ దశను భారత మహిళల జట్టు పరాజయంతో ముగించింది. గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 0-5తో చైనా చేతిలో చిత్తయింది. కెనడా, సింగపూర్‌లపై విజయాలతో ఇప్పటికే క్వార్టర్స్ బెర్త్ సొంతం చేసుకొన్న భారత్.. చైనాకు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది.

నేటి మ్యాచ్
రాత్రి 7.30 గం.
వేదిక: చెన్నై
చెన్నై X పంజాబ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

20 జట్లు...55 మ్యాచ్‌లు

అమెరికా-వెస్టిండీస్ వేదికలుగా మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ టీ20 ప్రపంచకప్ జూన్ ఒకటి నుంచి జరుగనుంది. 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపునుంచి టాప్‌లో నిలిచే రెండు జట్లు సూపర్-8కు చేరతాయి. జూన్ 29న జరిగే ఫైనల్‌కు బార్బడోస్ వేదిక కానుంది. అమెరికాలో మూడు, వెస్టిండీస్‌లో ఆరు వేదికల్లో కలిపి ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.

గట్టెక్కిన జెయింట్స్
పోరాడి ఓడిన ముంబై ● ప్లేఆఫ్స్ రేసు నుంచి హార్దిక్ సేన అవుట్?


స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 62)

లఖ్‌నవూ: ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో.. నెగ్గిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు మరింత చేరువైంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) అర్ధ శతకంతో పాటు బౌలర్లు రాణించడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 144/7 స్కోరు చేసింది. నేహల్ వధేరా (46), టిమ్ డేవిడ్ (35 నాటౌట్), ఇషాన్ కిషన్ (32) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో లఖ్‌నవూ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ (28) రాణించాడు. ఈ విజయంతో లఖ్‌నవూ 3వ స్థానానికి ఎగబాకగా.. ఏడో ఓటమితో ముంబై నాకౌట్ అవకాశాలు దాదాపుగా ముగిశాయి. గాయం నుంచి కోలుకొని ఈ మ్యాచ్‌లో ఆడిన మయాంక్ 3.1 ఓవర్లు బౌల్ చేసిన తర్వాత మళ్లీ నొప్పితో మైదానం వీడాడు.

ఆఖర్లో ఒత్తిడి: స్వల్ప ఛేదనలో స్టొయినిస్ రాణించినా.. లఖ్‌నవూ కష్టంగానే గట్టెక్కింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అరంగేట్రం ఆటగాడు అర్షిన్ కులకర్ణి (0)ని తుషార గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చాడు. అయితే, రాహుల్‌కు జత కలసిన స్టొయినిస్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు రాహుల్.. 5వ ఓవర్‌లో తుషార బౌలింగ్‌లో 4,6,4,4తో 20 రన్స్ రాబట్టాడు. పవర్‌ప్లే ముగిసేసరికి లఖ్‌నవూ 52/1తో నిలిచింది. కాగా, ధాటిగా ఆడుతున్న రాహుల్‌ను అవుట్ చేసిన హార్దిక్.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఈ దశలో స్టొయినిస్, దీపక్ హుడా (18) సంయమనంతో ఆడడంతో 10 ఓవర్లకు లఖ్‌నవూ 79/2తో మెరుగ్గానే కనిపించింది. అయితే, హుడాను పాండ్యా అవుట్ చేశాడు. నబి బౌలింగ్‌లో స్టొయినిస్ కూడా అదే ఓవర్‌లో అవుటయ్యాడు. చివరి 5 ఓవర్లలో సూపర్ జెయింట్స్ విజయానికి 29 రన్స్ కావాల్సి ఉండగా.. పూరన్ (14 నాటౌట్), టర్నర్ (5) నెమ్మదిగా ఆడడంతో ఆందోళన రేగింది. పైగా 17వ ఓవర్ బౌల్ చేసిన బుమ్రా ఒక్క పరుగే ఇవ్వగా.. తర్వాతి ఓవర్ తొలి బంతికే టర్నర్‌ను కొట్జీ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. ఇక, బదోని (6) రనౌటైనా.. ఒత్తిడి మధ్య పూరన్ మ్యాచ్‌ను ముగించాడు.

టాప్ ఢమాల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ సేన ఆరంభంలోనే తడబడింది. రోహిత్ (4)ను మొహిసిన్ స్వల్ప స్కోరుకే క్యాచవుట్ చేయగా.. సూర్యకుమార్ (10)ను స్టొయినిస్ వెనక్కిపంపాడు. తిలక్ వర్మ (7) రనౌట్ కాగా.. హార్దిక్ (0)ను నవీనుల్ డకౌట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో ముంబై 28/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ ఇషాన్, వధేరా ఐదో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. 9వ ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో కిషన్ ఇచ్చిన క్యాచ్‌ను టర్నర్ చేజార్చాడు. అయితే, గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న ఇషాన్‌ను బిష్ణోయ్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో వధేరా 6,6,4తో 16 పరుగులతో స్కోరు వేగం పెంచారు. అర్ధ శతకానికి చేరువవుతున్న తరుణంలో వధేరాను మొహిసిన్ అద్భుతమైన యార్కర్‌తో బౌల్డ్ చేయగా.. నబి (1)ని మయాంక్ అవుట్ చేశాడు. కానీ, డెత్‌లో డేవిడ్ కొంత ధాటిగా ఆడడంతో ముంబై 140 మార్క్ అయినా దాటింది.

స్కోరుబోర్డు

*ముంబై: ఇషాన్ (సి) మయాంక్ (బి) బిష్ణోయ్ 32, రోహిత్ (సి) స్టొయినిస్ (బి) మొహిసిన్ 4, సూర్యకుమార్ (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 10, తిలక్ (రనౌట్) 7, హార్దిక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 0, నేహల్ (బి) మొహిసిన్ 46, టిమ్ డేవిడ్ (నాటౌట్) 35, నబీ (బి) మయాంక్ 1, కొట్జీ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: **8; మొత్తం: 20 ఓవర్లలో 144/7; వికెట్ల పతనం:** 1-7, 2-18, 3-27, 4-27, 5-80, 6-112, 7-123; **బౌలింగ్:** స్టొయినిస్ 3-0-19-1, మొహిసిన్ 4-0-36-2, నవీనుల్ 3.5-0-15-1, మయాంక్ యాదవ్ 3.1-0-31-1, రవి బిష్ణోయ్ 4-0-28-1, దీపక్ హుడా 2-0-13-0.*

*లఖ్‌నవూ: రాహుల్ (సి) నబీ (బి) హార్దిక్ 28, అర్షిన్ (ఎల్బీ) తుషార 0, స్టొయినిస్ (సి) తిలక్ (బి) నబీ 62, దీపక్ హుడా (సి) బుమ్రా (బి) హార్దిక్ 18, పూరన్ (నాటౌట్) 14, టర్నర్ (బి) కొట్జీ 5, బదోని (రనౌట్) 6, క్రునాల్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: **11; మొత్తం: 19.2 ఓవర్లలో 145/6; వికెట్ల పతనం:** 1-1, 2-59, 3-99, 4-115, 5-123, 6-133; **బౌలింగ్:** తుషార 4-0-30-1, బుమ్రా 4-0-17-0, కొట్జీ 3-0-29-1, పీయూష్ 3-0-23-0, హార్దిక్ 4-0-26-2, నబీ 1.2-0-16-1.*

బవుమా, ఎన్‌గిడి అవుట్

కేప్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో మాజీ కెప్టెన్ తెంబా బవుమా, పేసర్ ఎన్‌గిడిలకు చోటు దక్కలేదు. కెప్టెన్‌గా మార్‌క్రమ్ వ్యవహరించనున్నాడు. అలాగే తొమ్మిది నెలల విరామం తర్వాత పేసర్ నోకియా జట్టులో చేరనున్నాడు. రొసో, వాన్‌డర్ డుస్సెన్‌లపైనా వేటు పడింది.

దక్షిణాఫ్రికా జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, రికెల్టన్, రబాడ, జాన్సెన్, కేశవ్ మహరాజ్, ఫోర్టున్, నోకియా, కొట్జీ, షంసీ, బార్ట్‌మన్.

ఇంగ్లండ్ జట్టులో ఆర్చర్

లండన్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆడే ఇంగ్లండ్ జట్టులో పేసర్ జోఫ్రా ఆర్చర్ చోటు దక్కించుకున్నాడు. బట్లర్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు. గాయం నుంచి కోలుకున్న ఆర్చర్ ఏడాది తర్వాత పునరాగమనం చేయనున్నాడు. స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ ఒక్కడే అన్‌క్యాప్‌డ్ ప్లేయర్. అలాగే ఇదే జట్టు మే 22 నుంచి పాక్‌తో జరిగే నాలుగు టీ20ల సిరీస్‌లోనూ పాల్గొంటుంది. దీంతో ఐపీఎల్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు బట్లర్, మొయిన్ అలీ, ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో, సామ్ కర్రాన్, టోప్లే, లివింగ్‌స్టోన్, విల్ జాక్స్ ప్లేఆఫ్స్‌కు ముందే తమ జట్లను వీడనున్నారు.

భారత్‌కు రెండో గెలుపు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో రెండో టీ20లో భారత మహిళల జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 19 పరుగులతో నెగ్గింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బంగ్లా 20 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. రాధా యాదవ్‌కు మూడు.. దీప్తి, శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 5.2 ఓవర్లలో 47/1 స్కోరు దగ్గర భారీ వర్షం కురవడంతో మ్యాచ్ రద్దయ్యింది. అప్పటికే రన్‌రేట్ మెరుగ్గా ఉండడంతో భారత్‌ను విజేతగా ప్రకటించారు.

హర్షిత్‌పై మ్యాచ్ నిషేధం

కోల్‌కతా: ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాకు 100 శాతం మ్యాచ్‌ఫీజు జరిమానాతోపాటు ఓ మ్యాచ్ నిషేధం విధించారు. సోమవారం ఢిల్లీతో మ్యాచ్‌లో అభిషేక్ పోరెల్‌ను అవుట్‌చేసిన రాణా ఫ్లయింగ్‌కిస్‌తో సెండాఫ్ ఇచ్చి దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఐపీఎల్‌లో అతను ఇలా చేయడం ఇది రెండోసారి.

నిత్య, ప్రత్యూషకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ గ్రాండ్ ప్రీలో తెలుగు అథ్లెట్లు నిత్య (తెలంగాణ), ప్రత్యూష (ఆంధ్రప్రదేశ్), షణ్ముగం (ఆంధ్రప్రదేశ్) పతకాలు కొల్లగొట్టారు. మంగళవారం బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో 100 మీటర్ల రేసులో స్వర్ణం గెలిచిన నిత్య.. ఆ తర్వాత 200 మీటర్ల పరుగులో కాంస్యం అందుకుంది. ఇదే రేసులో ప్రత్యూష పసిడి పతకం సాధించింది. పురుషుల 200 మీటర్ల రేసులో షణ్ముగం కాంస్యం దక్కించుకున్నాడు.

బిజినెస్

చిన్నారుల్లో పీసీవీ వ్యాక్సిన్ ఫలితాలు ప్రోత్సాహకరం:బీఈ

హైదరాబాద్: వ్యాక్సిన్ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన బయోలాజికల్-ఈ లిమిటెడ్ (బీఈ) చిన్నారుల కోసం తయారుచేసిన 14-వ్యాలెంట్ న్యూమో కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) మూడో దశ క్లినికల్ ట్రయల్స్ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్లు ప్రకటించింది. 6 నుంచి 8 వారాల వయసు గల శిశువులపై న్యూబీవ్యాక్స్ 14 టీఎం లేదా బీఈ-పీసీవీ-14 పేరిట తయారు చేసిన ఈ వ్యాక్సిన్‌ను పరీక్షించారు. ఈ అధ్యయన ఫలితాలను అంతర్జాతీయ జర్నల్ వ్యాక్సిన్ ఆమోదించి ప్రచురించినట్టు బీఈ తెలిపింది. దేశంలోని 12 ప్రదేశాల్లో 6-10-14 వారాల వయసు గల ఆరోగ్యవంతులైన 1,290 మంది శిశువులపై ఈ వ్యాక్సిన్ పరీక్షలు నిర్వహించారు. 3 డోసుల షెడ్యూల్ పూర్తయిన అనంతరం వారి శరీరానికి కలిగిన రక్షణను ఈ సందర్భంగా పరిశీలించారు. న్యూమోకోకల్ వ్యాధిలోని మొత్తం 14 రకాల స్టీరియోటైప్‌ల నుంచి శిశువులకు ఇది సంపూర్ణ రక్షణ కల్పించిందని ఆ పరీక్షల్లో తేలినట్టు తెలిపింది. ఇది పీసీవీ-13తో సమానమైన భద్రతా ప్రొఫైల్ కలిగి ఉన్నట్టు పేర్కొంది.

సనోఫీ మధుమేహ ఔషధం సోలిక్వా

న్యూఢిల్లీ: సనోఫీ ఇండియా.. మధుమేహ చికిత్సలో ఉపయోగించే సోలిక్వా ఇంజెక్షన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి గత ఏడాది ఈ ఔషధం మార్కెటింగ్‌కు అనుమతి లభించింది. ఇన్సులిన్, గ్లార్గిన్ 100 యూనిట్లు/ఎంఎల్ కాంబినేషన్ ఉన్న ఈ ఇంజెక్షన్ పెన్ ధర రూ.1,850.

తగ్గిన మోల్డ్ టెక్ లాభం

హైదరాబాద్: మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్ మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.160.74 కోట్ల అమ్మకాలపై రూ.27.85 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,468.75 కోట్ల అమ్మకాలపై రూ.292.67 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ధర పెరిగినా పసిడికి తగ్గని గిరాకీ

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 8% వృద్ధి, 136.6 టన్నులుగా నమోదు
3 నెలల్లో 19 టన్నుల గోల్డ్ కొనుగోలు చేసిన ఆర్‌బీఐ : డబ్ల్యూజీసీ వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) భారత్‌లో బంగారం గిరాకీ వార్షిక ప్రాతిపదికన 8 శాతం పెరిగి 136.6 టన్నులకు చేరుకుంది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) మంగళవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలల్లో బంగారం ధరలు భారీగా పెరిగి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక వాతావరణం ఈ విలువైన లోహానికి గిరాకీ కొనసాగేందుకు దోహదపడిందని డబ్ల్యూజీసీ రిపోర్టు పేర్కొంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సైతం దూకుడుగా బంగారం కొనుగోళ్లు జరపడం మెరుగైన వృద్ధికి మరో కారణమని నివేదిక పేర్కొంది. గత ఏడాది జనవరి-మార్చి కాలానికి గోల్డ్ డిమాండ్ 126.3 టన్నులుగా నమోదైంది. మరిన్ని ముఖ్యాంశాలు..

● విలువపరంగా, క్యూ1లో బంగారం గిరాకీ 20 శాతం వృద్ధితో రూ.75,470 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో దేశీయంగా బంగారం ధరలు సగటు 11 శాతం పెరిగినప్పటికీ, పసిడికి డిమాండ్ రెండంకెల స్థాయిలో వృద్ధి చెందడం గమనార్హం.

● మొత్తం డిమాండ్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి 95.5 టన్నులకు చేరుకోగా.. పెట్టుబడి అవసరాల కోసం బంగారం కడ్డీలు, నాణేల కొనుగోళ్లు 19 శాతం వృద్ధి చెంది 41.1 టన్నులకు చేరుకున్నాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లోకి సైతం 2 టన్నులకు పైగా పెట్టుబడులు వచ్చాయి. విలువపరంగా బంగారు ఆభరణాల విక్రయాలు 15 శాతం పెరిగి రూ.52,750 కోట్లుగా, బంగారంలో పెట్టుబడులు 32 శాతం పెరిగి రూ.22,720 కోట్లుగా నమోదయ్యాయి.

● ఈ జనవరి-మార్చిలో దేశీయంగా 38.3 టన్నుల బంగారం రీసైక్లింగ్ జరిగిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 10 శాతం అధికమని డబ్ల్యూజీసీ తెలిపింది.

● క్యూ1లో ఆర్‌బీఐ 19 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గత ఏడాది మొత్తానికి కొనుగోలు చేసిన 16 టన్నుల కంటే అధికమిది. ఈ ఏడాదిలో మరింత బంగారం కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బీఐ సంకేతాలిచ్చిందని డబ్ల్యూజీసీ ఇండియా రీజినల్ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు.

● ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగి 179.4 టన్నులకు చేరుకున్నాయి. 2023లో ఇదే సమయానికి 143.4 టన్నుల బంగారం దిగుమతైంది.

● క్యూ1లో ప్రపంచవ్యాప్త బంగారం డిమాండ్ 3 శాతం పెరిగి 1,238 టన్నులకు చేరుకుంది. 2016 తర్వాత గోల్డ్ గ్లోబల్ డిమాండ్‌పరంగా ఇదే అత్యంత బలమైన త్రైమాసికమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది.



ఈ ఏడాది దేశంలో బంగారం డిమాండ్ 700-800 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చు. ధరలు మరింత ఎగబాకిన పక్షంలో పసిడి గిరాకీ వార్షిక అంచనాలోని దిగువ శ్రేణికే పరిమితం కావచ్చు. గత ఏడాది గోల్డ్ డిమాండ్ 747.5 టన్నులుగా నమోదైంది. ప్రస్తుత త్రైమాసికం (ఏప్రిల్-జూన్) విషయానికొస్తే, పసిడి ధరలు ఏప్రిల్‌లో అమాంతం పెరగడంతో పాటు ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో గిరాకీ స్తబ్ధుగానే ఉండనుందని భావిస్తున్నాం.
- సచిన్ జైన్, రీజినల్ సీఈఓ, ఇండియా, డబ్ల్యూజీసీ

జోయాలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ సంస్థ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా వజ్రాలు (డైమండ్స్) కొనుగోలు చేసిన వినియోగదారులకు రూ.2,000 విలువైన ఉచిత వోచర్స్ అందించనున్నట్లు తెలిపింది. అలాగే రూ.50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన బంగారు నగలు కొనుగోలు చేసిన ఖాతాదారులకు రూ.1,000 విలువైన గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి నగలు కొనే కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు జోయాలుక్కాస్ వెల్లడించింది. మే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ మధ్య వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌ల్లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. కాగా ఈ అక్షయ తృతీయ కోసం జోయాలుక్కాస్ 10 లక్షలకు పైగా విలక్షణమైన ఆభరణాలను తన షోరూమ్స్‌లో అందుబాటులో ఉంచింది.

డబ్ల్యూఏఎస్‌ఎల్ ఈక్విటీలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు వాటా

హైదరాబాద్: విమానాశ్రయాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించే డబ్ల్యూఏఎస్‌ఎల్ ఈక్విటీలో, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 8.4 శాతం వాటా తీసుకుంది. ఇందుకోసం రూ.57 కోట్లు చెల్లించినట్టు తెలిపింది. విమానాశ్రయాలకు సంబంధించిన వ్యాపారాల్లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే చర్యల్లో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కొనుగోలు చేసింది. ఉత్తిష్ఠ విరాట్ ఫండ్ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కోసం 4.6 లక్షల షేర్లను కొనుగోలు చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	87,000 ▼
ముంబై	71,710 ▼	65,686 ▼	80,050 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ

హైదరాబాద్	365	విజయవాడ	370
వరంగల్	367	గోదావరి	370
చిత్తూరు	468	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.48

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	129	విజయవాడ	135
వరంగల్	129	గుంటూరు	137
కరీంనగర్	129	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	127
కర్నూలు	129	నెల్లూరు	127
విశాఖపట్నం	127	అనంతపురం	135
గోదావరి	135		

నిఫ్టీ సరికొత్త రికార్డు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల దన్నుతో ఎన్ఎస్ఈ నిఫ్టీ మంగళవారం సరికొత్త జీవితకాల గరిష్ఠానికి ఎగబాకింది. ఇంట్రాడేలో ఒక దశలో సూచీ 139.95 పాయింట్ల లాభంతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 22,783.35 వద్దకు చేరుకుంది. బీఎస్ఈ సెన్సెక్స్ సైతం 440 పాయింట్లకు పైగా బలపడి 75,111.39 స్థాయికి పెరిగింది. కానీ, ఆఖరి గంటలో మదుపరులు బ్యాంకింగ్, ఐటీ, మెటల్ రంగ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సూచీలు ఏకంగా నష్టాల్లోకి మళ్లాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 188.50 పాయింట్ల నష్టంతో 74,482.78 వద్దకు జారుకుంది. నిఫ్టీ 38.55 పాయింట్లు కోల్పోయి 22,604.85 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోయాయి.

జేఎన్‌కే లిస్టింగ్ అదుర్స్: హీటింగ్ పరికరాల తయారీ సంస్థ జేఎన్‌కే ఇండియా మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.415తో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు 49.39 శాతం ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయింది. ఒకదశలో 71.56 శాతం పెరుగుదలతో రూ.712 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 67.21 శాతం లాభంతో రూ.693.95 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,859.81 కోట్లుగా నమోదైంది. గతవారంలో ముగిసిన కంపెనీ ఐపీఓకు సైతం భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు 28 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ ఐపీఓకు సెబీ ఓకే: గోల్డ్ లోన్ కంపెనీ మణప్పురం ఫైనాన్స్ అనుబంధ విభాగమైన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ ఐపీఓకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.1,500 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది.

నేడు మార్కెట్లకు సెలవు: మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1న (బుధవారం) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సెలవు. మార్కెట్లు గురువారం యథావిధిగా పనిచేస్తాయి.

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో జరిగే మోసాలకు చెక్

» కొత్త నిబంధనలు జారీ చేసిన సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లో జరిగే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ వంటి విధానాలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఎంఎఫ్‌లను నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇలాంటి మోసాలను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ఏఎంసీలు ఈ వ్యవస్థల పనితీరుకు జవాబుదారీగా ఉండడంతో పాటు బాధ్యత కూడా తీసుకోవాలని సెబీ స్పష్టం చేసింది.

మరింత పర్యవేక్షణ

ఈ వ్యవస్థలో ఉద్యోగులు, బ్రోకర్లు, డీలర్లు చేసే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలను అడ్డుకునేందుకు మరింత పర్యవేక్షణ, అంతర్గత నియంత్రణ పద్ధతులు ఉండాలని సెబీ స్పష్టం చేసింది. ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు జరిపే వారిని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు గట్టి పర్యవేక్షణ కూడా అవసరమని తెలిపింది. మంగళవారం సమావేశమైన సెబీ డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఓటర్ల కోసం అభిబస్ ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్: ఆన్‌లైన్ బస్-టికెటింగ్ ప్లాట్‌ఫామ్ అభిబస్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఓటర్ల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల కోసం అభివోట్ పేరుతో ఈ ఆఫర్‌ను తీసుకువచ్చినట్లు అభిబస్ సీఈఓ లెనిన్ కోడూరు, సీఓఓ రోహిత్ శర్మ తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రతి టికెట్ కొనుగోలుపై రూ.100 క్యాష్‌బ్యాక్‌తో పాటు 20 శాతం నుంచి రూ.250 వరకు డిస్కౌంట్‌ను అందించనున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్ మే 11 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

● గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.. మార్కెట్లోకి హై పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఆంపైర్ నెక్సస్ విడుదల చేసింది. దీని ధర రూ.1,09,900 (ఎక్స్‌షోరూమ్). 3కిలోవాట్ ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో కూడిన ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 136 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కంపెనీ సీఈఓ విజయ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న కస్టమర్లకు మే నెల ద్వితీయార్థం నుంచి ఈ స్కూటర్ డెలివరీలను ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది.

● కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో కర్దా కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్)లో అమెరికాకు చెందిన మినర్వా వెంచర్స్ ఫండ్ వాటా కొనుగోలు చేసింది. ఏప్రిల్ 26న బల్క్ డీల్ ద్వారా ఎన్ఎస్ఈలో 1 శాతం వాటాకు సమానమైన కోటి షేర్లను మినర్వా వెంచర్స్ ఫండ్ కొనుగోలు చేసింది.

● కేఎస్‌బీ లిమిటెడ్.. మార్చితో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.544.2 కోట్ల అమ్మకాలపై రూ.43.1 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. తొలి త్రైమాసిక విక్రయాల్లో 11 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. సమీక్షా కాలంలో మహారాష్ట్ర ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుంచి 2,500 సోలార్ వాటర్ పంపింగ్ సిస్టమ్స్ కోసం రూ.63 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు కేఎస్‌బీ తెలిపింది.

● అపే ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్ కోసం బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను తీసుకువచ్చినట్లు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. వినియోగదారుడు డీలర్‌షిప్స్ నుంచి రూ.2.59 లక్షలకు అపే ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను కొనుగోలు చేస్తే.. నెలవారీ అద్దె కింద డీలర్ దగ్గర నుంచి బ్యాటరీని అందించనుంది. బ్యాటరీ లీజ్ కాలపరిమితి కార్గో వాహనాలకు 1,20,000 కిలోమీటర్లు లేదా 8 సంవత్సరాలు, ప్యాసింజర్ వాహనాలకు 1.5 లక్షల కిలోమీటర్లు లేదా ఎనిమిది సంవత్సరాలుగా ఉంటుంది.




తెనాలి రోడ్‌షోలో బస్సు పైకెక్కిన అభిమానులకు చంద్రబాబు అభివాదం


తెనాలి మార్కెట్ సెంటర్‌లో సభకు హాజరైన జన సందోహం

మహాజనం


చంద్రబాబు ప్రసంగానికి విజిలేస్తున్న మహిళ


తెనాలి సభలో ప్రసంగిస్తున్న అభ్యర్థి మనోహర్, చంద్రబాబు, పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి రాజా


చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ..


ప్రజలకు అభివాదం

- తెనాలిలో చంద్రబాబుకు నీరాజనం
- జైత్రయాత్రలా తెనాలి ప్రజాగళం
- సైకో పాలనతో అమరావతి ధ్వంసమైంది
- గొడ్డలి వేటు ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపు

తెనాలి రూరల్/ గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనం.. జనం.. మహాజనం. తెనాలి ప్రజాగళం పోటెత్తింది. చంద్రబాబు ప్రజాగళం జైత్రయాత్రలా సాగింది. ప్రజాగళం యాత్రలో చంద్రబాబుకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. హెలిప్యాడ్ నుంచి మార్కెట్ సెంటర్‌లోని సభా ప్రాంగణం వరకు మంగళవారం జరిగిన రోడ్ షోలో చంద్రబాబుకు ప్రజల నుంచి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఇసుకేస్తే రాలని జనంతో తెనాలి కిటకిటలాడింది. రోడ్డుకు ఇరువైపులా అధినేత చంద్రబాబు కోసం నిరీక్షించి మరీ ప్రియతమ నేతను సభా ప్రాంగణానికి జనం తీసుకువెళ్లారు. అనంతరం తెనాలి మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను చంద్రబాబు ఎండగట్టారు. టిడ్కో ఇళ్లు ఉచితంగా పేదలకు ఇస్తామని, కూటమి మ్యానిఫెస్టోను చదివి దాన్ని అర్థం చేసుకుని చైతన్యవంతులై కూటమిని గెలిపించాలని కోరారు. సైకో పాలనతో అమరావతి ధ్వంసమై, తెనాలి అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఏమీ చేయకుండానే అన్ని హామీలు నెరవేర్చానని జగన్ మాట్లాడుతున్నాడు. సైకో ప్రభుత్వం పోవాలి. దేశానికి ఆదర్శంగా అమరావతి రాజధాని, పోలవరం పూర్తి చేసుకుందాం.. ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా తీర్చిదిద్దుకుందాం.. ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని చంద్రబాబు ప్రజలకు పిలుపిచ్చారు. కుటుంబం మొత్తం భరించలేక వదిలేసిన ఒంటరి జీవి జగన్ అని, ఒంటరి వాడైన జగన్ రాజధాని కట్టలేడని, పోలవరం నిర్మించలేడని, రోడ్లు వేయలేడని ప్రజలు గుర్తించాలని గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వైసీపీలాగా దోచుకోవడానికి, రాష్ట్రానికి నష్టం చేయడం కోసం పెట్టుకున్న పొత్తు కాదని, విలువలతో కూడిన రాజకీయాల కోసం, నిజాయితీగా మన ప్రాంతం, ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీలు పెట్టుకున్న పొత్తిదని తెనాలిలో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దార్శనికుడైన చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కోరారు.

> రాష్ట్రంలో బందిపోట్ల పాలన సాగుతుంది. దానిని తెనాలి నుంచే తరమికొడదాం. తిరుగుబాటుకు ప్రజలందరూ సిద్ధం కండి. ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకుని సైకో భూతాన్ని తరిమి కొట్టాలి. ప్రజలందరూ ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసి గొడ్డలి వేటు ప్రభుత్వాన్ని సాగనంపాలి. పట్టణ ప్రాంత ప్రజలు ఎండకు భయపడి ఓటేయకపోతే గొడ్డలి మళ్లీ అధికారంలోకి వస్తుంది. ఈసారి అది ప్రతి ఇంటికి వచ్చి బెదిరిస్తుంది.
>
> - చంద్రబాబు


బాబు ప్రసంగానికి ముస్లింల కేరింతలు


చంద్రబాబుకు అభిమానుల అభివాదం

రూ. 80 కోట్లు దోపిడీ

- మళ్లీ గెలిస్తే శివకుమార్ టాక్సు చట్టబద్ధం
- తెనాలి ఎమ్మెల్యేపై ధ్వజమెత్తిన చంద్రబాబు

'తెనాలిలో ఒక భయంకరమైన ఎమ్మెల్యే ఉన్నాడు. తెనాలి చరిత్రలో ఎన్నడూ జరగని అరాచకాలు జరిగాయి. సెంటు పట్టా కోసం సేకరించిన భూముల్లో 80 కోట్లు దోచిన దొంగ వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్. వెంచర్లు వేయాలన్నా, అపార్టుమెంట్లు కట్టాలన్నా కప్పం కట్టాల్సిందే. ఈ సారి ఎన్నికల్లో తిరిగి వైసీపీకి ఓటు వేస్తే జే(జగన్) ట్యాక్సుతో పాటు శివకుమార్ ట్యాక్స్‌ను చట్టబద్ధం చేస్తాడు. మున్సిపల్ ఎన్నిక ల్లో టీడీపీ కౌన్సిలర్ ఇంట్లోకి శివకుమార్ తన అనుచరులను పంపి మద్యం బాటిళ్లు పెట్టించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే సీసీ కెమెరాల్లో శివకుమార్ దొంగాటకు ముగింపుపడింది. ఆర్యవైశ్య సంఘానికి చెందిన కౌన్సిలర్ యుగంధర్‌పై దాడి చేయించాడు. మార్కెట్ యార్డులో మామూళ్లకు పాల్పడుతున్నాడు. బిల్డింగ్‌కు ఒకరేటు, స్థలాలకు ఒకరేటు అంటూ శివకుమార్ ట్యాక్సులు వసూలు చేస్తున్నాడు. ప్రశాంతంగా ఉండే తెనాలిలో ఇసుక మాఫియాతో అలజడి సృష్టిస్తూ దుర్మార్గపు పాలన చేస్తూ తిరిగి అధికారం కోసం చూస్తున్నాడు జాగ్రత్త.. అంటూ ప్రజలను చంద్రబాబు హెచ్చరించారు. కొన్ని వందల లారీల్లో ఇసుక తరలించి దోచుకున్న దొంగ ఈ సైకో ముఖ్యమంత్రికి స్వాతి ముత్యమని ఎద్దేవా చేశారు. అలాంటి వారికి తెలివైన తెనాలి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇక నీ ఆటలు సాగవు.. తాట తీస్తాం. ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యవహరించు అంటూ చంద్రబాబు శివశంకర్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు.

తోడు.. నీడగా ఉంటా

ప్రజలు ప్రస్తావిస్తున్న సమస్యలు

గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు ముంపు, ఎన్ఎస్‌పీ కెనాల్ ఆధునికీకరణ, తాగునీటి సమస్యలపై ప్రజలు ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. గుంటూరు నగరంలో కలిసినా తమ గ్రామాల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేక పోయిందని విమర్శిస్తున్నారు. ఎక్కడా రోడ్లు, కాలువలు వేసిన దాఖలాలు లేవు. రాజధాని లేకుండా చేశాడనే బాధ అందరిలో ఉంది.

సూపర్ సిక్సే

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు.. నిజంగా సూపర్ సిక్సే. ఇందులో ఏదీ తక్కువ కాదు. ప్రతి ఒక్క పథకం ప్రజలకు ఎంతో చేరువైంది. అన్ని వర్గాల వారు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొంత మందితో మాట్లాడితే తమకు జగన్ ప్రభుత్వం నుంచి ఏమీ అందలేదని చెప్పారు.

ఎంతో ఆనందం

ప్రచారంలో నాకు ప్రతి రోజు మరిచిపోలేని అనుభూతులే కనిపిస్తున్నాయి. కలెక్టర్‌గా ఉన్నప్పుడు నాకు ఆ మేలు జరిగింది. ఈ భూమి ఇచ్చారు. ఈ రోడ్డు వేశారు అంటూ ప్రజలు చెపుతుంటే చాలా ఆనందంగా ఉంది. అడ్మినిస్ట్రేటర్ ప్రతినిధిగా వచ్చాడన్న ఆనందం ప్రజలలో కనిపిస్తుంది. అన్ని గ్రామాల్లో ప్రజలు చూపిస్తున్న అభిమానం మరిచిపోలేనిదిగా ఉంది.

- రైతుల కష్టాలు, బాధలు తెలుసు
- గెలుపు తథ్యం.. భారీ మెజారిటీపైనే దృష్టి
- 2500 మంది ఎన్ఆర్ఐలున్న ప్రత్తిపాడులో ఐటీ కారిడార్
- ఆంధ్రజ్యోతితో ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30: ఈ ప్రాంతానికి నేను సుపరిచితుడును. కలెక్టర్‌గా, పంచాయతీరాజ్ కమిషనర్‌గా చేసిన నాకు ప్రజా సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలుసు. వాటి పరిష్కార మార్గాలు తెలుసు. రైతు కుటుంబంలో పుట్టిన నాకు రైతుల కష్టాలు తెలుసు. నిరుద్యోగులు పడే బాధలు తెలుసు. ప్రజాప్రతినిధిగా అందరికీ తోడుగా, నీడగా ఉండేందుకు సంసిద్ధంగా ఉన్నా.. అని ప్రత్తిపాడు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు తెలిపారు. ప్రచార పర్వాలు జోరుగా సాగుతున్న వేళ పలు అంశాలపై రామాంజనేయులు ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రత్తిపాడులో గెలుపు తథ్యం అని, కేవలం మెజారిటీపై మాత్రమే దృష్టి పెట్టామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థి పెమ్మసానికి భారీ మెజారిటీ ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. అందరిలో ఒక్కడిలా మెలుగుతూ.. నేను మీ వాడినే అని భరోసా ఇస్తూ ప్రచారంలో దూసుకెళ్తోన్న రామాంజనేయులు వివిధ అంశాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలు.. ఆయన మాటల్లోనే..

ప్రచార సరళి.. ప్రజా స్పందన

గ్రామాలలో ఎన్నికల ప్రచారం చాలా బాగా సాగుతుంది. ఎనిమిది నెలల నుంచి గ్రామాల్లో పర్యటిస్తున్నాను. రెండో సారి కూడా ప్రచారం నిర్వహిస్తున్నా. ప్రతి గ్రామంలో కూడా తెలుగుదేశం పార్టీని ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. 1983లో అన్న ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో ప్రజా స్పందన ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే కనిపిస్తుంది. నామినేషన్‌కు తరలి వచ్చిన ప్రజలను చూస్తే ఇది అర్థమవుతుంది. చంద్రబాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీతో పాటు సూపర్ సిక్స్ పథకాలే ఇందుకు కారణం. మహిళల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తుంది.

సమస్యలపై హామీలు

టీడీపీ హయాంలో ఎమ్మెల్యే వారధిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని సమస్యలను పరిష్కరిస్తారు. గుంటూరు ఛానల్, నల్లమడ వాగులకు నిధులు ఆనాడే చంద్రబాబు మంజూరు చేశారు. రివర్స్ టెండర్ల ద్వారా రద్దు చేశారు. ఈ ప్రధాన సమస్యలను సులభంగా పరిష్కరిస్తాం. గ్రామాలలో రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు చంద్రన్న వెంట పరుగెడతాయి. వాటికి ప్రత్యేకంగా హామీలు ఇవ్వాల్సిన అవసరం లేదు. 2500 వరకు ఎన్ఆర్ఐలు ఉన్న ప్రత్తిపాడులో ఐటీ కారిడార్ ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఏమీ చేయలేదు

ఎమ్మెల్యే మీద ఆరోపణల కన్నా వైసీపీ పాలనలో జగన్ ఎవరి చేత పనిచేయించడు. పనిచేయించడానికి నిధులు ఇవ్వడు. హోం మంత్రిగా ఉన్నప్పుడే ఏమీ చేయలేక పోయింది. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ది అనేదే లేదు. తట్ట మట్టితో గుంతను కూడా పూడ్చలేదు. చంద్రబాబు హయాంలో వేసిన రోడ్డు తప్ప మరేమీ వేయలేదు.


ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు

వైసీపీ దౌర్జన్యాలు..

వైసీపీ స్వభావమే ప్రజలను ఇబ్బంది పెట్టడం. దౌర్జన్యాలు, దోపిడీ నిత్యకృత్యం. ప్రశ్నించే వారిని హింసించడం సర్వసాధారం. నాకు స్వయంగా అనుభవం కూడా అయింది. నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారని అడిగినందుకు నా కారుపై దాడి చేశారు. పైగా తిరిగి నాపైనే కేసులు కూడా పెట్టారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వేదిక పైన నరేంద్రకుమార్ తదితరులు


వైసీపీ కక్కుర్తి రాజకీయాలు

- ఐజేఎం అపార్ట్‌మెంట్ వాసుల సమావేశంలో డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, ఏప్రిల్ 30: నేరుగా పోటీ చేయలేమని భయం ఏర్పడిందో ఏమో కానీ దొడ్డిదారి రాజకీయాలకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నారు. జనసేన పార్టీ సింబల్ అయిన గాజు గ్లాసును పోలిన మరో గుర్తును ద్వారా ఎన్నికల్లో పోటీకి ప్రయత్నిస్తున్నారు' అని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నంబూరులోని ఐజేఎం రెయిన్ ట్రీ అపార్ట్‌మెంట్ వాసులతో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సింహం సింహం అని చెప్పుకొని జగన్ ఎన్నికలు వచ్చేసరికి కక్కుర్తి రాజకీయాలకు తెర తీశారు. ఒక పార్టీ పేరు చెప్పుకొని గాజు గ్లాసు గుర్తు ద్వారా నాపై, చంద్రబాబు, లోకేశ్, మరికొన్ని ఆరు నియోజకవర్గాల్లో గాజు గ్లాసు గుర్తుపై ఇండిపెండెంట్(స్వతంత్ర) అభ్యర్థులని పోటీచేయిస్తున్నారు. అంతభయం ఎందుకు మీకు? ప్రజలందరికీ ఒకటే చెప్పాలనుకుంటున్నాం. మన గుర్తు సైకిల్ గుర్తు. గుంటూరు పార్లమెంట్‌లోని ఒక తెనాలి నియోజవర్గంలో అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ సైకిల్ గుర్తు ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. మనకి ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నా ప్రజలకు ఉపయోగపడేలా చేయకపోవడం అనేది వైసీపీ నాయకుల వైఫల్యం. మన గ్రామానికి ఆ నేతల గురించి ప్రజలకు బాగా అర్థమైంది. జగన్ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత, టీడీపీపై ఆశావహ దృక్పథం వ్యక్తం అవుతుంది. మరికొద్ది రోజుల్లో వెలవడే ఎన్నికల ఫలితాల ద్వారా టీడీపీకి 150 అసెంబ్లీ సీట్లు, 23 పార్లమెంట్ సీట్లు వచ్చిన ఆశ్చర్యపోనవసరం లేదు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలతో పాటు ప్రజలకు కావాల్సిన ఇతర సౌలభ్యాలు కల్పించడం టీడీపీ లక్ష్యం అన్నారు. పొన్నూరు టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సరైన సమయంలో ఓటు హక్కును సరైన వ్యక్తికి వేయకపోతే ఎలాంటి నష్టం జరుగుతుంది? అనే అంశంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి. మీ విలువైన ఓటును సైకిల్ గుర్తుపై వేయాలని కోరుతున్నాను. రెయిన్‌ట్రీ అపార్ట్‌మెంట్ వాసులకు అందుబాటులో పక్కనే ఉన్న డాంగేనగర్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటుచేశాం. అందరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలి. జనసేన నియోజకవర్గ నాయకులు వడ్రానం హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

టీడీపీకే క్షత్రియ సేవాసంఘం మద్దతు

క్రోసూరు, ఏప్రిల్ 30: పల్నాడు జిల్లాలో పోటీచేస్తున్న టీడీపీ అభ్యర్థులకు క్షత్రియ సేవాసంఘం మద్దతు ప్రకటిస్తుందని ఆసంఘ పల్నాడుజిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల బలరామకృష్ణంరాజు తెలిపారు. మంగళవారం ఆయన క్రోసూరులో విలేకరులో మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం తమను అన్నివిధాలా మోసం చేసిందన్నారు. క్షత్రియ కార్పొరేషన్ కంటి తుడుపుచర్యగా ఏర్పాటు చేసి నిధులు, విధులు నియామకాలు ఏవీ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. జిల్లాలో ఇప్పటికే తమ సామాజికవర్గానికి చెందిన వారు టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ఉన్నారన్నారు. సమావేశంలో 88 తాళ్ళూరు మాజీ సర్పంచ్ వాసుదేవ మహరాజ్, సంఘ నేతలు కళ్ళేపల్లి వెంకటేశ్వరరాజు, నాగరాజు, నర్సరాజు తదితరులు పాల్గొన్నారు.



నాడు నిండు కుండగా టెయిల్‌పాండ్ రిజర్వాయర్, నేడు వెలవెలబోతూ..

అడుగంటిన టెయిల్ పాండ్ రిజర్వాయర్

రెంటచింతల, ఏప్రిల్ 30: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో నీళ్లు అడుగంటిపోవడంతో కళావిహీనంగా దర్శనమిస్తుంది. 2023 జులై నుంచి ఆశించినంత స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఏడాది మొత్తం కూడా 1 ఎంయు విద్యుదుత్పత్తికి పరిమితమైంది. ఈ సారి రిజర్వాయర్‌లో కేవలం 2.950 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గత నెల 13 నుంచి మూడు రోజుల పాటు పులిచింతలకు 5 గేట్లను మీటరన్నర మేర ఎత్తి 3 టీఎంసీల నీటిని వదిలారు. ఎగువన భారీ వర్షాలు కురవకపోవడమే సమస్యకు కారణం.

నియంత పోకడలతో జగన్ ప్రభుత్వం

- శ్రీకృష్ణ దేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ
- నకరికల్లు మండల గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

నకరికల్లు, ఏప్రిల్ 30: ఒక్క సాగు నీటి ప్రాజెక్టు ఊసే లేకుండా వైసీపీ మేనిఫెస్టో ఉందని, ఒక్క ఎకరాకు సాగు నీరు అందించటానికి స్థిరీకరణ చేసే అవకావం లేని దయనీయ పరిస్థితుల్లో రాష్ట్రం ఉందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు, నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలు తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలోభాగంగా మండలంలోని చాగల్లు, కండ్లకుంట, చీమలమర్రి, చల్లగుండ్ల, నకరికల్లు, నరసింగపాడు గ్రామాల్లో కన్నా, లావు విస్తృతంగా పర్యటించారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కోసం చేపట్టిన గోదావరి - పెన్నా నదుల అనుసంధానం, వరిక పుడిశెల, ఇండో ఇజ్రాయేలు ప్రాజెక్టు, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటుచేసి తాగు నీటిని అందజేస్తామన్నారు. గుక్కెడు మంచి నీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నాసిరకం మద్యంతో ప్రజలు గొంతు తడుపుకొనే పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమం అందించే దిశగా టీడీపీ మేనిఫెస్టో రూపకల్పన జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను అభ్యున్నతిలోకి తీసుకువచ్చేలా సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల్లో నమ్మకం కలిగిందన్నారు.



మాట్లాడుతున్న కన్నా, పక్కన ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్షేమం ముసుగులో లూటీ చేయటం తప్పా వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. సహజ సంపదను దోచుకోవటంతో పాటు ప్రజలను, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలనకు అంతం పలికేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు.

జననీరాజనం... మండుటెండను సైతం లెక్క చేయకుండా మంగళవారం మండలంలో ప్రజలు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణకు ప్రజలు నీరాజనం పలికారు. మహిళలు ఆనందంతో కేరింతలు కొట్టారు. కండ్లకుంటలో కన్నా చంటిబిడ్డను ఎత్తుకొని ప్రేమతో ముద్దాడారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు నలబోతు వెంకటరావు, కనుమూరి బాజీచౌదరి, నాగోతు శౌరయ్య, రావెల సత్యనారాయణ, జ్ఞాన కోటేశ్వరరావు, రావెల సాయి నవీన్, కోడెల అబ్బయ్య, పమిడి బాలకృష్ణ, అలపర్తి రమేష్, మాదాల కృష్ణబాబు, శాఖమూరి శ్రీను, కేసినేని వెంకటరత్నం, నల్లగట్ల శ్రీను, పెమ్మసాని వీరయ్య, నల్లగట్ల మల్లయ్య, గుంటుపల్లి పూర్ణచంద్రరరావు, నాదెండ్ల సత్యనారాయణ, జూనెబోయిన హరీష్, స్వర్ణ రామారావు, తిరుమలశెట్టి వెంకటరావు, జనసేన నేతలు బత్తిన శ్రీనివాసరావు, రాడ్ల శ్రీను, రావెల గోపీకృష్ణ, బీజేపీ నేతలు నలబోతు వెంకటరావు, శంకరరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, మున్వర్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



కండ్లకుంట ర్యాలీలో నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

వైసీపీ అభ్యర్థి కోనపై ఈసీకి ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతిపై చర్యలు తీసుకోవాలని జైబీమ్ రావ్ భారత్‌పార్టీ నుంచి బాపట్ల పార్లమెంట్ స్థానానికి పోటీచేస్తున్న వర్రె కోటయ్య ఎన్నికల కమిషన్‌కు ఫ్యాక్స్ ద్వారా సోమవారం ఫిర్యాదుచేశారు. అఫిడవిట్‌లో పేర్కొన్న ఇంటి స్థలం అసైన్డ్ భూమి అయితే దానిని సొంత స్థలంగా పేర్కొన్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రికార్డులు తారుమారు చేశారని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి ఆధారాలతో ఆర్వోకు ఫిర్యాదు చేశానని అందులో వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి అఫిడవిట్‌పై అభ్యంతరం లేవనెత్తాననే అక్కసుతో ఆయన అనుచరులు తనపై బెదిరింపులకు దిగారని, జోగిరాజా అనే వ్యక్తి ఇంటికి వచ్చి కత్తితో పొడిచి చంపేస్తానని ఫోన్‌లో బెదిరంచారని ఫిర్యాదులో వివరించారు. ఈ విషయంపై బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయబోతే దానిని తీసుకోలేదని వర్రె కోటయ్య ఆరోపించారు. పైగా తననే బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరాడని దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

దాచేపల్లి, ఏప్రిల్ 30: 'వైసీపీని వీడి టీడీపీలో చేరడమే అతను చేసిన తప్పు. మమ్మల్ని కాదని టీడీపీలో చేరతావా? నీకు ఎంత అహంకారం. మా మాట అంటే లెక్కలేదు..' అంటూ వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మంగళవారం దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. కేశానుపల్లికి చెందిన జక్కుల కోటేశ్వరరావు ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి కోటేశ్వరరావుపై వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడటం, కవ్వింపు చర్యలు చేపట్టడం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఇంటివద్ద వున్న కోటేశ్వరరావును నలుగురు వైసీపీ నాయకులు పట్టుకొని రాయితో దాడిచేసి గాయపరిచారు. కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే గాయపడిన కోటేశ్వరరావును దాచేపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న దాచేపల్లి పోలీసులు గ్రామానికి చేరుకొని బందోబస్తు నిర్వహిస్తున్నారు.

భారీగా నగదు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.11,30,500 భారీనగదు సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీల్లో ఏప్రిల్ 30 సాయంత్రం 6 గంటల వరకు రూ.2,66,91,103 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గంగాధర్

టీడీపీ వైపు నాయీ బ్రాహ్మణులు

- టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 30: నాయీ బ్రాహ్మణులు టీడీపీ వైపే ఉన్నారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. మంగళవారం దుర్గి మండలం ముటుకూరులో నిర్వహించిన నాయీ బ్రాహ్మణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ నాయీ బ్రాహ్మణులకు హామీలతో కూడిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీ ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. లావు శ్రీకృష్ణదేవరాయలు, జూలకంటి బ్రహ్మారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు మాచర్ల హనుమంతురావు, నాగేశ్వరరావు, కొల్లిపాక వెంకటేష్, దుర్వాకుల నాగేశ్వరరావు, మర్రిపల్లి నరేంద్ర, రవితేజ, మద్దిరాల నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి

శావల్యాపురం, ఏప్రిల్ 30: ద్విచక్రవాహనం, ఆటో ఢీకొనడంతో వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన మండలంలోని కారుమంచి సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముండ్రువారిపాలెం ఎస్సీకాలనీకి చెందిన కూలీలు సంతమాగులూరు మండలం అడవిపాలెంలో మిరపకాయలు కోతకు వెళ్ళి ఆటోలో తిరిగి వస్తున్నారు. అదే సమయంలో శావల్యాపురం మండలం బొందిలిపాలెం ఎస్సీకాలనీకి చెందిన రావినూతల అవినాష్, కవలకుంట కొండయ్య, గొల్లపూడి బాబు ద్విచక్ర వాహనంపై కారుమంచికి వెళుతున్నారు. కారుమంచి సమీపంలోని నాలుగురోడ్ల కూడలి వద్దకు రాగానే ద్విచక్రవాహనం, ఆటో ఢీకొనడంతో ఆటో రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలోనున్న ముండ్రువారిపాలేనికి చెందిన దూపాటి ఎలీషా(14) అక్కడికక్కడే మృతి చెందగా ఆటో డ్రైవర్ అమృతపూడి మరియబాబు, ఆటోలోనున్న గుడిపాటి అంజయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై ఉన్న రావినూతల అవినాష్‌కు కాలు విరిగింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు, ఎస్ఐ చల్లా సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాసును నిలదీసిన

కాపు సంఘీయులు

- ఆగ్రహంతో ఊగిపోయిన మహేష్‌రెడ్డి..
- సొంత పార్టీ నేతల్లోనూ అసంతృప్తి
- చేద్దాం.. చూద్దాం అంటూ తప్పుకున్న కాసు

గురజాలటౌన్, ఏప్రిల్ 30: వైసీపీ గురజాల అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మండలంలోని పల్లెగుంత గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ముందుగా ఎస్సీ కాలనీలో ప్రచారం ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు మాత్రమే వస్తారు.. తరువాత పట్టించుకోరు.. ఐదేళ్లు పదవిలో ఉండి మాగ్రామానికి ఏం చేశావంటూ గ్రామస్థులు కాసును నిలదీశారు. చేస్తాం..చూస్తాం అంటూ ఆ వీధి దాటి ముందుకు వచ్చారు. అయితే కాపు సంఘీయులు తమకు సమా ధానం చెప్పాలంటూ నిలదీశారు. అయితే కాసుని నిలదీసిన వారిలో సొంతపార్టీ (వైసీపీ)కిచెందిన వారూ ఉండడం గమనార్హం. దీంతో కాసు ఒక్కసారిగా స్వరం పెంచి చేస్తాం.. చూస్తాం అని చెప్పాగా అంటూ గదమాయించారు. కాపు సంఘీయులు వెనక్కు తగ్గకుండా ఐదేళ్లుగా ఇదే చెప్పారు.. ఎన్నికలు కూడా వచ్చాయి.. ఇప్పుడూ అదే చెప్తున్నారంటూ మరోమారు గట్టిగా నిలదీశారు. దీంతో ఆగ్రహించిన కాసు కాపు సంఘీయులపై దూసుకెళ్లారు. చేస్తాం అని చెబుతున్నాగా.. నోర్మూ యండి అంటూ అరిచి ఎన్నికల ప్రచారాన్ని మధ్యలోని నిలిపేసి వెళ్లిపోయారు.



కాపు సంఘీయులపై ఆగ్రహంతో ఊగిపోతున్న కాసు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పల్లెగుంతలో సచివాలయం ఏర్పాటు చేశారు. 2021 జూన్‌లో తన సామాజిక (రెడ్డి) వర్గీయులు అధికంగా ఉన్న అంబాపురంకు సచివాలయం తరలించారు. 2020లో రాష్ట్రమంతా వైసీపీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా, అదే క్రమంలో పల్లెగుంత గ్రామంలో 57 ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయి. అయితే ఆసమయంలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాలను ఎన్నికల కోడ్‌కు కొద్దిరోజుల ముందు అందించారు. పల్లెగుంతలో 2180 గృహాలుండగా, వీటిలో సుమారు 200 దాకా కాపు కుటుంబాలు ఉంటాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక కాపు సామాజిక వర్గీయులు నివసిస్తున్న వీధుల్లో ఎక్కడా కూడా అభివృద్ధి జరగలేదు. దీంతో ఆదివారం రాత్రి తమ గ్రామానికి వచ్చిన కాసును కాపు సంఘీయులు అభివృద్ధిపై నిలదీశారు. వారికి సరైన సమాధానం ఇవ్వకుండానే కాసు ఎన్నికల ప్రచారాన్ని మధ్యలోనే నిలిపేసి వెళ్లిపోయారు.

సీఎం జగన్‌రెడ్డి పెద్ద పెత్తందారుడు

- 1596వ రోజుకు ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్లూరు, ఏప్రిల్ 30: సీఎం జగన్‌రెడ్డి పెద్ద పెత్తందారుడని, రాజధాని గ్రామాల రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు మంగళవారం నాటికి 1596వ రోజుకు చేరుకున్నాయి. ఈ సదంర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. భూములిచ్చిన రైతుల నేలపై నుంచి పాలనచేస్తూ మూడు రాజధానులని అమరావతిని నాశనం చేయాలనుకోవటం సిగ్గు చేటన్నారు. అమరావతి అభివృద్ధిని కొనసాగించటం చేతకానివారు మూడు రాజధానులు పెడతామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో అమరావతి ద్రోహులను ఇంటికి పంపుతామని స్పష్టంచేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో రైతుల ఆందోళనలు, నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి.

88,660 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 95,529 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 88,660 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,263 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	18000
నెంబరు. 5	9000	15000
273	9000	12000
341	9000	16000
4884	9000	14000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	16000
తెల్లకాయలు	5000	11000



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ముస్లిం రిజర్వేషన్‌లకు చంద్రబాబు, పవనే రక్ష

- ఎన్‌ఆర్‌సీ, సీఏఏకి పార్లమెంట్‌లో ఆమోదం తెలిపింది ఎవరు?
- వైసీపీ దుష్ప్రచారాలను నమ్మొద్దు..
- ఆత్మీయ సమావేశంలో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్30: రాష్ట్రంలో ముస్లిలకు ఉన్న 4శాతం రిజర్వేషన్‌లకు చంద్రబాబు, పవన్ కల్యాణే పెద్ద రక్ష అని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ దుష్ప్రచారాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎంతోకాలంగా తెలుగుదేశం పార్టీతో కలసి సాగుతున్న ముస్లిం మైనార్టీల్లో ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం తమపై ఉందన్నారు. బీజేపీతో రిజర్వేషన్‌ల రద్దు, క్రైస్తవ ముస్లిం ప్రార్థన స్థలాలకు ముప్పు, మైనార్టీలకు రక్షణ ఉండదని అబద్దపు ప్రచారాలు చేస్తున్న వైసీపీ ఐదు సంవత్సరాలుగా ఎవరితో కలసి నడిసిందో చెప్పాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. భారతీయ సమాజంలో ముస్లింలు, క్రైస్తవులు అంతర్భాగం అన్న ఆయన వారి ప్రయోజనాలకు ఎవ్వరూ విఘాతం కలిగించలేరన్నారు. ఎన్‌ఆర్‌సీ, సీఏఏకి పార్లమెంట్‌లో ఎవరు ఆమోదం తెలిపారో సమాధానం చెప్పాలన్నారు. లౌకిక భావన, సామస్య పూర్వక వాతావరణం ముందు తమకు పదవులు గడ్డిపూసతో సమానం అని స్పష్టం చేశారు. ముస్లిం మైనార్టీలు, దళిత క్రైస్తవుల జోలికి ఎవరు వచ్చినా తమ పదవులతో పాటు చంద్రబాబు కూడా ఆపదవిలో నిమిషం కూడా కొనసాగరన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ వైసీపీలో అవమానాలు, దొంగచాటు వ్యవహారాలు తప్పా మరేమి లేవన్నారు. నాఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటూనే జగన్ వారినే నిలువునా మోసం చేశారన్నారు. ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి తన కేసుల కోసమో, జైలుకు వెళ్ళకుండా ఉండటానికో బీజేపీ బంధాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ముస్లింలు ఎవ్వరూ ఈ ఫేక్ వీడియోలను నమ్మవద్దని, రిజర్వేషన్‌లు మార్చబోమని బీజేపీ పెద్దలంతా చెప్పిన విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, ముస్లిం మైనార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి'

- గుంటూరు కలెక్టర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు
- అమరావతి భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణపై పిల్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 28న గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి సాంబశివరావు, రాజధాని రైతు పరిరక్షణ సమితి జాయింట్ సెక్రటరీ ధనేకుల రామారావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. అధికార దుర్వినియోగం చేస్తూ దురుద్దేశపూర్వకంగా కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు, సీఆర్డీయే చట్టం, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనలకు కలెక్టర్ నిర్ణయం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగరాన్ని ధ్వంసం చేయాలనే ఏకైక లక్ష్యంతో భూసేకరణ ప్రక్రియను ఉపసంహరించారని ఆరోపించారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే రైతులకు పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 'కలెక్టర్ ఉత్తర్వులతో రాజధాని ప్రాంతంలో అక్కడక్కడ వ్యవసాయ భూములు మిగిలిపోతాయి. అమరావతి నగరం అభివృద్ధికి అవరోధం కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌కు మార్పులు చేస్తే రైతుల హక్కులకు భంగం వాటిల్లుతుంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లాలే గానీ దానిని ఉపసంహరించడానికి వీల్లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయండి' అని పిటిషన్‌లో కోరారు. వ్యక్తిగత హోదాలో సీఎం జగన్, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీతో పాటు సీఎస్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీసీఆర్డీఏ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.



దీక్షలో పాల్గొన్న శ్రీ లక్ష్మీ, సంఘీబావం తెలుపుతున్న దళిత నాయకులు

బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- 4వ రోజుకు చేరిన శ్రీ లక్ష్మీ నిరాహార దీక్ష

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30: స్థానిక వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, అగడాలకు గురైన బాధితులందరికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి శ్రీలక్ష్మీ స్పష్టం చేశారు. గుంటూరు, స్వర్ణభారతి నగర్‌లోని ఆమె నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్వర్ణభారతి నగర్, కృష్ణతులసి నగర్, మిషన్ ఫారమ్ ఇతర ప్రాంతాల్లో పేదల స్థలాలు, ప్రభుత్వం ఇచ్చిన నివాసాలను అక్రమించుకున్నారని ఆరోపించారు. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఉన్నాతాధికారులకు, పాలకులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. న్యాయం జరిగే వరకు దీక్షలోనే ఉంటానని స్పష్టం చేశారు. దీక్షలకు సీనియర్ న్యాయవాది చందోలు శోభారాణి, జనం పార్టీ నాయకులు కె.ఆనందబాబు, పిల్లి రాంబాబు, చల్లా రత్నంరాజు, బండి అమర్ తదితరులు మద్దతు తెలిపారు.

రుణాలు ఇప్పిస్తామని మోసం

- పోలీసుల అదుపులో సైబర్ నేరగాడు

తెనాలి క్రైం, ఏప్రిల్ 30: పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేరుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ బారి లోన్‌యాప్ ద్వారా అధిక మొత్తాల్లో రుణాలు ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడుతున్నాడు. తెనాలి పాండురంగ పేటకు చెందిన ఏడుకొండలకు లోన్ యాప్ ద్వారా రూ.3లక్షలు ఇప్పిస్తానని లోన్ యాప్‌లో అకౌంట్ ఓపెన్ చేయించాడు. ఆ లోన్ యాప్‌లో ఏడకొండలు పేరు మీద కొంత నగదు జమ జరిగింది. అది తిరిగి వారికే పంపిస్తే ఇంకా అధిక మొత్తంలో లోను వస్తుందని చెప్పి ఆ వచ్చిన లోన్‌ను షేక్ అబ్దుల్‌బారి తన అకౌంట్‌కి బదలాయించుకున్నాడు. ఈ విధంగా లక్షా పదహారు వేలు మోసం చేశాడు. ఇది గుర్తించిన ఏడుకొండలు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.70
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00




ప్రజాగళం
గుంటూరు
ఆంధ్రప్రజల భవిష్యత్తుకు భరోసానిస్తూ..
ప్రజాగళం కార్యక్రమానికి నేడు గుంటూరు
విచ్చేయుచున్న మన ప్రియతమ నాయకులు,
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగత సుమాంజలులు తెలుపుతూ...
నేడు (ది. 1-5-2024) సాయంత్రం 6 గంటలకు
కొరిటెపాడు టెలిఫోన్ ఎక్స్చేంజ్ దగ్గర నుండి లాడ్జి సెంటర్,
శంకర్ విలాస్, హిందూ కాలేజ్ మీదుగా జిన్నాటవర్
సెంటర్ వరకు రోడ్ షో మరియు 8.20 గంటలకు
జిన్నాటవర్ సెంటర్ నందు బహిరంగ సభ జరుగును.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,
బిజెపి పార్టీల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు
వేలాదిగా పాల్గొని జయప్రదం చేయమనవి.
ఎన్నికల తేది : 13-5-2024
సైకిల్ గుర్తుకే మన ఓటు
శ్రీమతి గళ్ళా మాధవి
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి
శ్రీ మహమ్మద్ నసీర్
గుంటూరు తూర్పు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి
గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ
డా॥ పెమ్మసాని చంద్రశేఖర్
గుంటూరు పార్లమెంట్ టిడిపి-జనసేన-బిజెపి ఉమ్మడి అభ్యర్థి


తెనాలి యువగళం యాత్రలో మేనిఫెస్టో చూపుతూ ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

నేడు గుంటూరుకు చంద్రబాబు

- రెండు నియోజకవర్గాల్లో అధినేత రోడ్ షో
- జిన్నాటవర్ సెంటర్లో భారీ బహిరంగ సభ
- చంద్రబాబు సమక్షంలో డిప్యూటీ మేయర్ సజీలా చేరిక
- సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్న మూడు పార్టీల నేతలు
- జోరుమీదున్న కూటమి శ్రేణుల్లో మరింత జోష్

గుంటూరు, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు పర్యటను ఖరారైంది. మే ఒకటి, కార్మిక దినోత్సవం మేడే రోజున ఆయన గుంటూరు నగరంలో చంద్రబాబు ప్రజాగళం యాత్రను కొనసాగించనున్నారు. బాపట్ల జిల్లా చీరాలలో జరిగే ప్రజాగళం సభకు హాజరై అటునుంచి నేరుగా ఆయన గుంటూరు చేరుకుంటారు. నగరంలోని గుంటూరు వెస్టు, ఈస్టు నియోజకవర్గాల్లో ఆయన రోడ్ షో నిర్వహిస్తారు. నగరంలోని జిన్నా టవర్ సెంటర్ వద్ద ఆయన బహిరంగ సభలో పాల్గొంటారు.

విస్తృత ఏర్పాట్లు

చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రెండు నియోజకవర్గాల్లో రోడ్‌షో, బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి గుంటూరు పార్లమెంటు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థులు, జిల్లా నేతలు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం సన్నాహక సభ జరగగా, మంగళవారం మరోమారు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రజాగళం సభ నిర్వహణ పరిశీలకుడిగా హాజరయ్యారు. పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు, పశ్చిమ అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, పోతినేని శ్రీనివాసరావు, డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు తదితర ముఖ్యనాయకులు ఏర్పాట్లపై సమీక్షించారు.

నగరంలో రోడ్ షో.. బహిరంగ సభ

చీరాల నుంచి హెలికాప్టర్ ద్వారా ముందుగా గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి కొరిటెపాడు బీఎస్ఎన్ఎల్ ఆఫీసుకు చేరుకుని అక్కడ నుంచి చంద్రబాబు రోడ్‌షో నిర్వహించనున్నారు. గుంటూరు లాడ్జిసెంటర్, శంకర్ విలాస్, హిందూ కాలేజీ సెంటర్ల మీదుగా జిన్నా టవర్ సెంటర్ చేరుకుంటారు. అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడతారు. ఈ సభకు మూడు పార్టీల శ్రేణులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం వుండడంతో పార్టీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

జోరుమీదున్న కూటమి..

జిల్లాలో టీడీపీ దూకుడుగా ముందుకు సాగుతోంది. ఎన్నికల కోడ్ వచ్చింది మొదలు రోజువారీ చేరికలతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో చంద్రబాబు పర్యటన పార్టీ శ్రేణుల్లో మరింత జోరుగా సాగుతోంది. క్షేత్రస్థాయి లో పనిచేస్తున్న టీడీపీ-జనసేన- బీజేపీ శ్రేణులకు చంద్రబాబు పర్యటన ఉత్సాహాన్ని ఇవ్వనుంది. కాగా ఇప్పటికే జిల్లాలోని వందలమంది అధికార వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేల చేరికతో టీడీపీ కళకళలాడుతోంది. ఈ క్రమంలో బుధవారం జరిగే చంద్రబాబు బహిరంగ సభలో గుంటూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి షేక్ షౌకత్‌లు టీడీపీలో చేరడం దాదాపుగా ఖరారయింది. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన గుంటూరు తూర్పు నియోజకవర్గ సమావేశానికి వారిరువురు హాజరయ్యారు. పెమ్మసాని, నసీర్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసీపీకి షాక్

- గుంటూరు డిప్యూటీ మేయర్ సజీల వైసీపీకి రాజీనామా
- ఇప్పటికే ఆరుగురు వైసీపీ కార్పొరేటర్‌లు టీడీపీలోకి...
- ఇదే బాటలో మరికొంతమందంటున్న టీడీపీ నేతలు
- కార్పొరేటర్లపై నిఘా పెడుతున్న వైసీపీ నేతలు

గుంటూరు, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు ముందే అధికార వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు కొడుతున్నాయి. మొన్నటివరకు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే నగరానికి చెందిన ఆరుగురు కార్పొరేటర్‌లు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా తాజాగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి వైసీపీ నాయకుడు షేక్ షౌకత్‌లు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. వారిద్దరూ టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి బుధవారం మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో కీలకనేత, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని ఇటీవల యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన గత రెండు ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కృషి చే శారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే సుభానితో పాటు తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్‌తో పాటు వైసీపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టీ, షేక్ మీరావలి, వేముల జ్యోతిలు చేరారు. అలానే పశ్చిమ నియోజకవర్గం నుంచి వైసీపీ నుంచి జంప్ చేసేవారు ఎవరూ లేరనకున్న వైసీపీ నేతలకు కూడా ముగ్గురు కార్పొరేటర్ల ఝలక్ ఇచ్చారు. ఇటీవల టీడీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ వెంట వైసీపీ కార్పొరేటర్ శ్రీవల్లి కూడా వెళ్లారు. అనంతరం 28వ డివిజన్ కార్పొరేటర్ సాధు ఉమామహేశ్వరి, భర్త రాజేష్, 19వ డివిజన్ కార్పొరేటర్ హనుమాయమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇటీవల టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

మరి కొంతమంది..

కాగా నగరంలో వైసీపీకి చెందిన కీలకనేతలు టీడీపీలో చేరే పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే ఆరుగురు కార్పొరేటర్‌లు టీడీపీలోకి వెళ్లిన విషయం తెలిసిందే. టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు గుంటూరు తూర్పు, పశ్చిమ టీడీపీ అభ్యర్థులు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవిలు ఇంటింటికి ప్రచారంతో పాటు మరో వైపు టీడీపీలో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్‌లు తమకు టచ్‌లో ఉన్నారని, త్వరలోనే చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు.

వైసీపీ కార్పొరేటర్‌లపై నిఘా

నగరంలో ఆరుగురు అధికార పార్టీ కార్పొరేటర్లు టీడీపీలోకి వెళ్ళటంపై ఆ పార్టీ అధిష్టాన పెద్దలు కార్పొరేటర్‌లపై నిఘా పెట్టారు. ఏ కార్పొరేటర్లు పార్టీని వీడేలా ఉన్నారు, ఏం ఆశించి, ఎందుకు వెళుతున్నారు.. వంటి వివరాలు సేకరిస్తూ కార్పొరేటర్ల కదలికలపై ఆరా తీస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని బృందాలను రంగంలోకి దించినట్లు పార్టీ వర్గాల సమాచారం.


పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్‌లతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ షేక్ సజీల, షేక్ షౌకత్

చేనేత, స్వర్ణకార వృత్తులకు పూర్వవైభవం

- నారా బ్రాహ్మణి


మంగళగిరి ఆటోనగర్‌లో పచ్చళ్ల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుంటున్న బ్రాహ్మణి

మంగళగిరి సిటీ, ఏప్రిల్30: మంగళగిరిలో ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన చేనేత, స్వర్ణకార వృత్తులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నారా లోకేశ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని నారా బ్రాహ్మణి అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ తరపున మంగళగిరి పట్టణంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు. తొలుత మంగళగిరి ఆటోనగర్‌లోని విజయ పికెల్స్‌ను సందర్శించారు. పచ్చళ్ల తయారీ కేంద్రంలోని మహిళా కార్మికులతో కలిసి ఆవకాయ పచ్చడిని కలిపారు. కొత్త ఆవకాయ పచ్చడిని రుచిచూచి, చిన్నప్పుడు అమ్మ పెట్టిన ఆవకాయను గుర్తుచేసుకున్నారు. చిరువ్యాపారులు తమ కాళ్లపై తాము నిలబడి ఉపాధి పొందేలా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. అక్కడి నుంచి మంగళగిరి షరాబ్ బజారుకు విచ్చేశారు. చెరుకు రసం అమ్మే మహిళతో మాట్లాడి చెరుకు రసం తాగారు. తనకు సొంత ఇల్లు లేదని, లోకేశ్‌కు చెప్పి ఇల్లు ఇప్పించాలని ఆ మహిళ కోరగా.. తప్పకుండా సొంతింటి కల నెరవేరుస్తామని బ్రాహ్మణి భరోసా ఇచ్చారు. షరాబ్ బజారులో బంగారు ఆభరణాల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆభరణాల తయారీ విధానం, వ్యాపారాలు సాగుతున్న తీరు, సరికొత్త మోడళ్లను గురించి వాకబు చేశారు. ఓ జ్యూయలరీ షాపులో జుమ్కీలు కొనుగోలు చేశారు. లోకేశ్‌ను గెలిపించుకోవడం ద్వారా మంగళగిరిని గోల్డెన్ హబ్‌గా తయారు చేసుకుందామని స్వర్ణకారులకు బ్రాహ్మణి విజ్ఞప్తి చేశారు. షరాబ్ బజారు నుంచి కాలినడకన తెనాలి రోడ్డును చేరుకుని పలు వస్త్ర దుకాణాలను సందర్శించారు. వస్త్ర ఉత్పత్తి, నూతన డిజైన్లు, వ్యాపారాలు సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 2014-19 మధ్యన చంద్రబాబు పాలనలో అమరావతికి వచ్చి వెళ్లే వారితో మంగళగిరిలో వ్యాపారాలు బాగా సాగాయని, గడిచిన అయిదేళ్లలో వ్యాపారాలు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు చేనేత వస్త్ర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతకు అన్ని విధాలుగా తోడ్పాటునందించేందుకు నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని బ్రాహ్మణి తెలిపారు. ఎన్నికల తరువాత లోకేశ్‌తో కలిసి మంగళగిరిలో పర్యటిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు తమ్మిశెట్టి జానకీదేవి, ఆరుద్ర భూలక్ష్మీ, ఊట్ల దుర్గామల్లేశ్వరీ, మంచికలపూడి వైష్ణవి, జగ్గారపు రామమోహనరావు, ఆకురాతి నాగేంద్రం, జొన్నాదుల బాలకృష్ణ, గాజుల శ్రీనివాసరావు, పడవల మహేష్, జనసేన నేత షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరి మెయిన్ బజారులో చెరుకు రసం తయారు చేస్తున్న మహిళతో మాట్లాడుతున్న బ్రాహ్మణి


మంగళగిరిలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న నారా బ్రాహ్మణి

మూడు చోట్ల అదనపు బ్యాలెట్ యూనిట్లు

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


కలెక్టరేట్‌లో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ఈవీఎంలలో అదనపు బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సిన అవసరం ఏర్పడిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి అదనంగా అవసరమైన ఈవీఎంల బ్యాలెట్ యూనిట్ల కేటాయింపునకు ఈవీఎం మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా సప్లిమెంటరీ మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 30 మంది అభ్యర్థులు, గుంటూరు పశ్చిమ అసెంబ్లీ స్థానానికి 28 మంది అభ్యర్థులు, మంగళగిరికి 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అందువల్ల అదనంగా ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు కేటాయించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఈవీఎం గౌడన్‌లో 684 మాత్రమే బ్యాలెట్ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. వీటిలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 282 పోలింగ్ బూత్‌లకు రిజర్వుతో కలిపి అవసరమైన 349 యూనిట్లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. గుంటూరు లోక్‌సభ, మంగళగిరి అసెంబ్లీకి అవసరమైన బ్యాలెట్ యూనిట్లను పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాలో రిజర్వులో ఉన్న బ్యాలెట్ యూనిట్లను కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, గుంటూరు పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మీ, ఈవీఎం నోడల్ అధికారి వేణుగోపాల్, ఐటీ నోడల్ అధికారి రఘు రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

- ఇద్దరు అరెస్టు.. పరారీలో మరో ముగ్గురు

గుంటూరు, ఏప్రిల్ 30: ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ మద్యం ద్వారా భారీగా సొమ్ము చేసుకునేందుకు యత్నించిన ఓ ముఠాను స్పెషల్ ఎన్‌ఫోర్స్మెంట్ బ్యూరో సబ్ అధికారులు పట్టుకున్నారు. నగరాలులోని టెలికంనగర్‌కు చెందిన పాలెం రామ్మోహన్‌రావు, ప్రస్తుతం రెడ్డిపాలెంలో ఉంటున్న రాజుపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గోసుల శ్రీనులను అరెస్టు చేసి రూ.8 లక్షల 28 వేల 880 మద్యం బాటిళ్లను, మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సబ్ జిల్లా అదనపు ఎస్పీ మొగిలి వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గతంలో అక్రమ మద్యం కేసుల్లో నిందితుడిగా ఉన్న పాలెం రామ్మోహనరావు ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ మద్యానికి డిమాండ్ ఉండటంతో అక్రమంగా దిగుమతి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగా ఈ నెల 28న రాత్రి తన మినీ లారీకి డ్రైవర్‌గా గోసుల శ్రీనుతో నల్గొండ వెళ్లిన రామ్మోహనరావు ఖమ్మంకు చెందిన హనుమంతరావు ద్వారా 6376 క్వార్టర్ మద్యం బాటిళ్లను లోడ్ చేసుకున్నాడు. అనంతరం తుళ్లూరు మండలం దొండపాడుకి చెందిన పెనుమాక పూర్ణచంద్రరావుకు మద్యం అప్పగించేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు వద్ద సెబ్ ప్రత్తిపాడు ఎస్ఐ మాధవి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రామ్మోహన్‌రావు, గోసుల శ్రీనులను అరెస్టు చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ తెలిపారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచామని, ఇందులో భాగంగానే ఈ ముఠా పట్టుబడిందన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఇన్స్పెక్టర్లు విజయ్‌కుమార్, లత, ఎస్ఐలు ప్రభుదాస్, తులసి పాల్గొన్నారన్నారు. పెనుమాక పూర్ణచంద్రరావు, హనుమంతరావు, నల్గొండకు చెందిన మద్యం వ్యాపారిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు

ఆర్‌టీసీ బస్సులో తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం

దాచేపల్లి, ఏప్రిల్ 30: సూట్‌కేస్‌లో భద్రపరిచి ఆర్‌టీసీ బస్సులో మిర్యాలగూడ నుండి దాచేపల్లికి ప్రయాణం చేస్తున్న బస్సులో తరలిస్తున్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం దాచేపల్లి మండలం పొందుగల రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహిస్తున్న సాధారణ తనిఖీలలో అనుమానాస్పదంగా వున్న సూట్‌కేసును పరిశీలించగా అందులో 36 ఫుల్ బాటిల్స్ లభించాయి. వీటికి సంబంధించిన వ్యక్తుల గురించి బస్సు ఆపి పోలీసులు తనిఖీ చేస్తుండగా ఆ వ్యక్తి బస్సు దిగి పరారైనట్లుగా పోలీసులు గుర్తించారు. అతని కోసం సీసీ కెమెరాలలో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.30 వేల వరకు వుంటుందని పోలీసులు తెలిపారు. దాచేపల్లి సీఐ సురేంద్రబాబు పర్యవేక్షణలో ఎస్ఐ శివనాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మద్యం పట్టుకున్న దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ శివనాగరాజు


సీఈవో ముకేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న వర్ల రామయ్య, వంశీ కృష్ణ

డీఎస్పీ సుధాకర్‌పై సీఈవోకు ఫిర్యాదు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 30: గవర్నర్ క్యాంప్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పొన్నూరుకు చెందిన డీఎస్పీ కూచిపూడి సుధాకర్‌పై మంగళవారం టీడీపీ నాయకులు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. పొన్నూరు మండలం మునిపల్లె గ్రామానికి చెందిన కూచిపూడి సుధాకర్ గవర్నర్ బంగళాలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. సుధాకర్ సతీమణి కూచిపూడి స్వరూప రాణి మునిపల్లె సర్పంచ్‌గా ఉన్నారు. ఆయన సోదరుడు పలు కేసుల్లో ముద్దాయి అయినటువంటి రాజకుమార్ ద్వారా సుధాకర్ వైసీపీ లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజ్ కుమార్ ద్వారా ఫోనులో బెదిరింపుకుల పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆధారాలతో సహా ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీ కృష్ణ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఈవో తెలిపినట్లు టీడీపీ నేతుల చెప్పారు.

అంబటి మురళిపై ఫిర్యాదు...

వైసీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణపై టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సంఘటనపై చర్యలు తీసుకోవాలని సీఈవో ముకేష్ కుమార్ మీనాకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం పొన్నూరు పట్టణంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభా వేదికపై అంబటి మురళి ప్రసంగిస్తూ కులాల ప్రస్తావన తీసుకురావటం పట్ల టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అంబటి మురళిని నిలదీసిన దళితులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్30: వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణకు సొంత పార్టీ నుంచే చేదు అనుభవం ఎదురైంది. పొన్నూరు మండలం, కొండముది గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారానికి మురళీకృష్ణ వచ్చారు. దళితవాడ వద్దకు ప్రచారం చేరుకోగానే ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా అంబటి మురళీ ప్రచారాన్ని అడ్డుకొని నిలదీశారు. ఒక వర్గం వారిని ప్రోత్సహిస్తున్నారని వారి వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని దళితవాడ ప్రజలు తెలిపారు. అంతే కాకుండా మురళీ ప్రోత్సహిస్తున్న వ్యక్తులు గతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని, గ్రామంలో చిచ్చుపెట్టి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించటంతో గందరగోళం నెలకొంది. మురళి సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి ముందుకు కదలివెళ్లటంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న వ్యక్తులు ఫోన్లు లాక్కొని ఫొటోలు, వీడియోలు బలవంతంగా డిలీట్ చేయించారు.


కొండముదిలో అంబటి మురళీ ప్రచారం వద్ద అభ్యంతరం తెలియజేస్తున్న దళిత వాడ ప్రజలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి, ఏప్రిల్ 30: విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. నవులూరు గ్రామ పరిధిలోని మక్కెవారి పేట, గోలి వారి తోట, బాపనయ్య నగర్, ఈఎస్ఆర్ గార్డెన్స్, పుట్టతోట రోడ్డు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్, టిడ్కో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఏపీఎస్పీ క్యాంపు లోపల, ఇందిరానగర్, ఇప్పటం రోడ్డులో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, పాతమంగళగిరి, దింపుడు కళ్లం, సీతారామ స్వామి కోవెల, తెనాలి రోడ్డు, బాప్టిస్టు పేట, షరాబ్ బజారు, భార్గవపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తాడేపల్లి మండలంలో

తాడేపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని చిర్రావూరులో బుధవారం ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాజ చెక్‌పోస్టును పరిశీలించిన ఆర్వో



కాజ చెక్‌పోస్టు సిబ్బందితో మంగళగిరి ఆర్వో రాజకుమారి

మంగళగిరి, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ సరిహద్దు ప్రాంతమైన మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ చెక్‌పోస్టును జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి మంగళవారం సందర్శించారు. భద్రతా ఏర్పాట్లు, వాహనాల తనిఖీ విధానం, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో రాజకుమారి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ సరిహద్దులైన ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి వద్ద పోలీసు చెక్‌పోస్టులు, కృష్ణాయపాలెం, కాజ, రేవేంద్రపాడు గ్రామాల వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో షిఫ్ట్‌కు ఐదుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రతిచోట ఒక వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా 9 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంచేందుకు 5 వీడియో సర్వైలెన్స్ బృందాలు, మరో 5 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా బృందాల పనితీరును సీసీ టీవీల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్టయితే ఆయా బృందాలు రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

ఎన్నికల ఖర్చును నమోదు చేయాలి

మంగళగిరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను సంబంధిత రిజిస్టరులో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆర్వో రాజకుమారి సూచించారు. నమోదు చేసిన ఖర్చుల రిజిస్టర్, బిల్లులను మే 1, 5, 10 తేదీల్లో ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటలలోపు అభ్యర్థి కానీ, వారి తరఫున ఎన్నికల ఏజెంట్ కానీ ఎన్నికల వ్యయ పరిశీలకులచే తనిఖీ చేయించుకోవాలని తెలియజేశారు.

జగన్ పాలనలో దళిత హక్కులను కోల్పోయాం

● మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మల్లెల వెంకటరావు తదితరులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 30: ఎన్నో పోరాటాల ఫలితంగా దళితులు సాధించుకున్న హక్కులను జగన్ పాలనలో కోల్పోయామని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు అన్నారు. మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్ గెలుపునకు ఏయే సామాజిక వర్గాలైతే పని చేశాయో అధికారంలోకి వచ్చాక వారందరికీ పూర్తిగా అన్యాయం చేశారని విమర్శించారు. 75 ఏళ్ల స్వతంత్ర దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఎస్సీ కార్పొరేషన్‌ను ముక్కలు చేసి దళితులకు చెందాల్సిన నిధులను పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. 9 వేల ఎయిడెడ్ పాఠశాలలను రద్దు చేయడంతోపాటు పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దళిత, ప్రజాసంఘాలన్నీ ఈ విషయాలను గమనంలోకి తీసుకుని జగన్ ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40మాల సంఘాలతో ఈ నెల 9వ తేదీన మంగళగిరిలో భారీ కూటమి సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభ తాలూకా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ మంగళగిరి అభ్యర్థి గుర్రం రామారావు, నెమలికంటి దాసు తదితరులు పాల్గొన్నారు.

మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు

పెదనందిపాడు, ఏప్రిల్ 30: స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విప్లవకారుడు, మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజ్ఞానకేంద్ర ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు మాట్లాడుతూ వ్యవస్థ మార్పు కోసం తన కలాన్ని ఆయుధంగా చేసుకొని నిప్పులు కురిపించిన మహాకవి శ్రీశ్రీ అని, సమాజంలో అవినీతి అక్రమాలు, దోపిడీలను సాహిత్యం ద్వారా ఎత్తిచూపిన మహనీయుడు శ్రీశ్రీ అని కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొత్త వెంకటశివ, చుక్కా యానాదులు, భువనేశ్వరి, లక్ష్మీ, నల్లమోతు భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మ్యానిఫెస్టోతో.. ప్రతి ఇంటా సంక్షేమం

● ఎన్డీఏ కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు



పెదనందిపాడు మండలం అన్నవరంలో వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 30: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రతి ఇంట సంక్షేమం రాబోతుందని ప్రత్తిపాడు, ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రచారంలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని పెదపలకలూరు, అలాగే గుంటూరు రూరల్ మండలంలో దాసుపాలెం, తోకవారిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఇంటింటికి పర్యటిస్తూ సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలు గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ లాంటి నాయకులు అవసరమన్నారు. రివర్స్ టెండరింగ్ లాంటి పిచ్చి పనులతో జగన్ ఆపేసిన ప్రాజెక్టులు తిరిగా ప్రారంభించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రచారంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, టీడీపీ, జనసేన రూరల్ మండల అధ్యక్షుడు ఇమ్మడి మల్లికార్జునరావు, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

నగరపాలక సంస్థ పరిధిలో, 16వ డివిజన్, బుడంపాడు, అంబేద్కర్ కాలనీకి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు పార్టీలోకి చేరిన కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అన్నవరంలో 20 కుటుంబాలు

పెదనందిపాడు, ఏప్రిల్ 30: వైసీపీ అరాచకాలతో విసుగు చెందిన సొంత పార్టీ నేతలు టీడీపీకి వలస బాట పడుతున్నారు. దీనిలో భాగంగా మండలపరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రాజుపాలెం సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గుంటూరులోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో బూర్ల రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. గేరా దాసు, కొండపాటూరి సురేష్, తోకల వెంకటేశ్వర్లు, గేరా రాంబాబు, కూరపాటి రాఘవయ్య, గేరా సునీల్, సాంబిరెడ్డి, కమలయ్య, శివకృష్ణ, ఇమ్మానియేల్, నూకతోటి కరుణాకర్, జూపల్లి రాజు, గద్దె రమేష్‌లకు రామాంజనేయులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మదమంచి వాసు, పీఏసీఎస్ ఛైర్మన్ పాటిబండ్ల రాంబాబు, గేరా సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీ పాలెంలో ప్రచారం

పెదనందిపాడు మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సతీమణి జయమ్మ తన భర్త విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ విధివిధానాలను, ప్రజోపయోగ పథకాలను వివరిస్తూ ఆమె ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, లక్ష్మీ గణేష్, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దుష్ట పాలన నుంచి త్వరలోనే విముక్తి

● లోకేశ్‌తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి

● టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల విస్తృత ప్రచారం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 30: వైసీపీ దుష్ట పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు మరో 13 రోజుల్లో విముక్తి లభించనుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మంగళవారం పట్టణంలోని 1, 2, 32 వార్డులలో విస్తృత ప్రచారం నిర్వహించాయి. ఉమ్మడి కూటమి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధించాలంటే లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. లోకేశ్ గెలిస్తే మంగళగిరికి పరిశ్రమలను తీసుకురావడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా నాశనమైందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 28 పథకాలు, బీసీలకు సంబంధించిన 30 పథకాలకు, మైనార్టీలకు సంబంధించిన 11 పథకాలను జగన్ రద్దు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు రంగిశెట్టి నరేంద్ర (బాబీ),



కొత్తపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, జనసేన ఎంటీఎంసీ ప్రధాన కార్యదర్శులు బాణాల నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, కూటమి నేతలు షేక్ సుభానీ, విన్నకోట శ్రీనివాసరావు, రావి రమా, సైనాదం శ్రీనివాసరావు, ఖాదర్ హుస్సేన్, బి.కాంతారావు, పోలూరి బుజ్జి, తాడిగిరి సుధీర్, వాకా మాధవరావు, కోసూరి రాజశేఖర్, జొన్నాదుల బాలకృష్ణ, కొత్తపేట హుస్సేన్, షేక్ ఇంతియాజ్ సింహాద్రి బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల్లో తనిఖీ రూ.4.30 లక్షలు స్వాధీనం

తాడికొండ, ఏప్రిల్ 30: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన స్క్వాడ్‌లు నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. మంగళవారం లాం గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో తుళ్లూరు గ్రామానికి చెందిన నేలపాటి వినిత్‌కుమార్ నుంచి రూ.1,95,500 నగదును గుర్తించారు. అలాగే తాడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పల్నాడు జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన బండికుమార్ వాహనంలో రూ.2,35,000ల నగదును గుర్తించారు. వీటికి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో నగదును సీజ్ చేసి తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై పన్ను పోటు



నార్త్‌ప్యూల్ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తాడికొండ, ఏప్రిల్ 30: వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై పన్నుల భారాన్ని మోపి వెన్నుపోటు పొడిచారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం తాడికొండలోని 13వ వార్డులో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్డీఏ కూటమి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు పదిసార్లు పెంచి ప్రజలపై రూ.75 వేల కోట్ల భారం మోపారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.15 వేల కోట్ల అవినీతికి స్కెచ్ వేశారన్నారు. ఎన్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల నిధులను పక్కదారి మళ్లించి ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆర్థిక మూలాలను ధ్వంసం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరిపూడి సాంబశివరావు, గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షులు షేక్ బిలాల్, గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కోట సాంబశివరావు, ఆరుద్రగోపి తదితర నాయకులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 30: కార్మికవర్గం పోరును రక్తాక్షరాలతో లిఖించిన దినంగా అందుకు గుర్తుగా మే 1ని పోరాట దినంగా కార్మిక వర్గం జరుపుకుంటుందని బుధవారం జరిగే మేడేను జయప్రదం చేయాలని మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ప్రగతిశీల కార్మిక సమాఖ్య తీసుకొచ్చిన మేడే కరపత్రాన్ని మంగళవారం నులకపేటలోని యూనియన్ ఆఫీసులో ఆటో ఓనర్స్, డ్రైవర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి, ఎస్‌కే ఖాసిం, ఎస్‌కే జాన్‌సైదా, ఎస్‌కే సైదా, ఎస్‌కే శ్రీను, జి.శ్రీనివాసరావు, బి.వరప్రసాద్, బి.కృష్ణ, ఏడుకొండలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సూపర్ సిక్స్ పథకాలు



ప్రత్తిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30: పేద ప్రజలకు అండగా, వారి జీవనోపాదికి ఊతం అందించేలా తెలుగుదేశం పార్టీ పథకాలను రూపకల్పన చేసిందని ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడు లోని రామానగర్ కాలని, మాబూనగర్ కాలనీలతో పాటు పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బూర్ల రామాంజనేయులకు మద్దతుగా నిర్వహించిన ఈ ప్రచారానికి స్థానికుల నుండి విశేష స్పందన లభించింది. చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఉమ్మడి మ్యానిఫెస్టోలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నం శ్రీకాంత్, కుర్రి సుబ్బారెడ్డి, గోరిజవోలు వెంకటేశ్వరరావు, నూతలపాటి త్రిలోక్, గొగినేని శ్రీనివాసరావు, గవళ్లపల్లి విజయ్, కన్నయ్య, బాగం వెంకటేశ్వర్లు, కోటపాటి సదాశివరావు, హుస్సేనా డక్కుమళ్ల భాగ్యారావు, మల్లం రామకృష్ణ, అంకాళం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పెదవడ్లపూడిలో టీడీపీ శ్రేణుల ప్రచారం



పెదవడ్లపూడిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 30: మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. నేతలు ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మాదల రమేష్ బాబు, మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కోలాహలంగా పోలేరమ్మ శిడిమాను ఉత్సవం



శిడిమాను మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాకుమాను, ఏప్రిల్ 30: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొండపాటూరు స్వయంభు పోలేరమ్మతల్లి శిడిమానోత్సవం భక్తుల కోలాహలం మధ్య మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని వేకువజామున అమ్మవారికి తలంటుస్నానాలను నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పొంగళ్లను నేవేద్యంగా సమర్పించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్మవారికి బహూకరించారు. తిరునాళ్లలో అత్యంత ముఖ్యమైన ఘట్టమైన శిడిమాను ఉత్సవాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రత్యేకంగా అలంకరించిన శిడిమానుపై మేకను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య శిడిమాను ఉత్సవం సాగింది.

● ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్‌లు భక్తులతో కిక్కిరిశాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామ శివారులో పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ బాపట్ల, పొన్నూరు, చిలకలూరిపేట, గుంటూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది తిరునాళ్ల సందర్భంగా వన్ వే ట్రాఫిక్ అమలు ఉండేది. కానీ ఈ ఏడాది వన్ వే ట్రాఫిక్ అమల్లో లేకపోవడంతో కొంత ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

ఇప్పటంలో సీపీఎం శ్రేణుల ప్రచారం

తాడేపల్లి, ఏప్రిల్ 30: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ఇప్పటం గ్రామాల్లో సీపీఎం శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించాయి. నియోజకవర్గ సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా అభ్యర్థులకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జొన్నా శివశంకర్, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా జంగాల అజయ్ కుమార్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా టీడీపీ, వైసీపీలు మోదీ జపం చేస్తున్నాయని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా మోసం చేసిన మోదీతో టీడీపీ, జనసేన జతకట్టాయని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మోదీకి తాకట్టు పెట్టిందన్నారు. ఈ ప్రచారంలో సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్, సీపీఎం రాష్ట్ర నాయకురాలు వంకాయలపాటి శివనాగరాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ముత్యాలరావు, రాజ్‌కుమార్, పల్లె కృష్ణ, కంచర్ల సాంబశివరావు, సీపీఐ నేతలు చిన్ని తిరుపతయ్య, ముసునూరు సుహాస్, జాలాది జాన్‌బాబు, తుడిమిల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణతో రాష్ట్రాభివృద్ధి

తాడికొండ, ఏప్రిల్ 30: అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులను సీఎం నట్టేటముంచారన్నారు. విశాఖలో భూములు దోచుకునేందుకు మూడు రాజధానుల ప్రకటన చేశారని అన్నారు.



తెనాలి శ్రావణ్‌కుమార్‌కు హారతులిస్తున్న మహిళలు

భవిష్యత్తు తరాలకు రాజధాని అవసరం

● తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఏప్రిల్ 30: భవిష్యత్తు తరాలకు రాష్ట్రానికి రాజధాని అవసరమని తాడికొండ నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో జరిగిన రోడ్‌షోలలో ఆయన మాట్లాడారు. బీసీలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి నిధులు, విధులు లేకుండా చేసిన ఘనత జగన్ సర్కారుదేనన్నారు. చేనేత కార్మికుల సబ్సిడీలను ఎత్తి వేసి వారి జీవనోపాధికి గండి కొట్టారన్నారు. చేనేత వస్త్రాల కొనుగోళ్ళు కూడా జరపనందున చేనేత రంగం కుదేలైందన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లు తగ్గించారన్నారు. ఈ సందర్భంగా ఆయన చేనేత సొసైటీలను సందర్శించారు. వీరితో పాటు దళితులకు 27 పథకాలు రద్దు చేశారన్నారు. మైనార్టీల పథకాలైన దుల్హన్ పథకం, దుకాన్ అవుర్ మకాన్ పథకం, తదితరాలు రద్దు చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి మారు పేరైన తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కటికల రామ కోటేశ్వరరావు, పున్నారెడ్డి, పచ్చల రత్నరాజు, పాలపాటి వెంకటరావు, గుండెగ జోజి, కే యోహాన్, పీ లూర్దయ్య, కోటా శేషు, రామకృష్ణ, కే అప్పారావు, జ్యోతి, కొలగాని కొండలు, కొసన నాగరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 30: ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయడం వల్ల మేధోశక్తిని పెంపొందించుకోవచ్చునని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక లయన్స్ మాంటీస్సోరీ సీబీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న విద్యార్థులకు కేంద్రీయ బోధన చేయాలని, సామాజిక ఆర్థిక స్థితిగతుల బోధన చేసి వారి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశ పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకునే పుస్తకాలను పఠనం చేయాలన్నారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్యనందించినప్పుడే పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని తెలిపారు. శ్రీనివాస్, వెంకటేష్, కుసుమకుమారిలు ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు దాసరి శేషగిరిరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి, అధ్యక్షులు అరవపల్లి కృష్ణ, ప్రిన్సిపాల్ కిరణ్‌జోష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం

● జనసేన పార్టీ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు



జనసేనలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 30: వైసీపీ రాక్షస పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఆకుల అజయ్‌బాబు, చేబ్రోలు వెంకటేశ్వరరావు, ఆకుల మస్తాన్‌రావు, ఆకుల లక్ష్మి, తిరుపతమ్మ, మక్కె నాగరాజు, బండారు ప్రకాష్ చైతన్యతోపాటు పలువురు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి శ్రీనివాసరావు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వాసా శ్రీనివాసరావు, నేతలు పర్వతం మధు, బత్తినేని అంజయ్య, నీలాంబరం, కోలా భాగ్యారావు, ఉయ్యాల రోశయ్య, మత్తె నాగరాజు, లేళ్ల సాయినందన్, దూలిపూడి పావని, బండారు రాజేశ్వరీ, పోడాగం వాసు, ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాజు గ్లాసు గుర్తంటే వైసీపీకి వెన్నులో వణుకు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 30: గాజు గ్లాసు సింబల్ చూసినా, పవన్ కల్యాణ్ పేరెత్తినా వైసీపీ నేతల వెన్నులో వణుకు పుడుతుందని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఓటమి భయంతోనే అధికార వైసీపీ స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టి గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేయిస్తుందని విమర్శించారు. రాజనీతి ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అందుకు విరుద్ధంగా దొడ్డిదారిలో గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేయాలన్న నీచపు రాజకీయాలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 13 నియోజకవర్గాలతోపాటు మంగళగిరిలో స్వతంత్ర అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తును కేటాయించడం సమంజసం కాదన్నారు. దీనిపై న్యాయపరమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు. మంగళగిరిలో జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నేతలు పర్వతం మధు, వాసా శ్రీనివాసరావు, సాయినందన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి గెలుపుతోనే అభివృద్ధి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

మేడికొండూరు, ఏప్రిల్ 30: రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతమొందించాల్సిన అవసరం ఉందని, ఎన్‌డీఏ కూటమి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం రాత్రి మేడికొండూరు మండలం వరగాని గ్రామంలో జనసేనపార్టీ గ్రామ అధ్యక్షుడు బోడపాటి సాయిరామ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి కనుసన్నల్లో ఇసుక, మైనింగ్, లిక్కర్ మాఫియా పెట్రేగిపోయిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వైసీపీ నేతలు దౌర్జన్యాలకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని స్పష్టం చేశారు. గుంటూరు పార్లమెంట్, తాడికొండ అసెంబ్లీ స్థానాలలో టీడీపీ అభ్యర్థుల ఘన విజయానికి తాము శాయశక్తులా కృషి చేస్తామని వరగాని గ్రామంలోని జనసేన, టీడీపీ నాయకులు డాక్టర్ చంద్రశేఖర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, జనసేన నేతలు కోట ఆంజనేయులు, వరగాని టీడీపీ నాయకులు పావులూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

● సీఐ జయకుమార్

మేడికొండూరు, ఏప్రిల్ 30: సాధారణ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎటువంటి గొడవలకు దిగవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ హెచ్చరించారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాజకీయ పార్టీల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా పోలీసు చర్యలు తీవ్రంగా ఉంటాయని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సంయమనంతో ఉండాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, ఎన్నికల విధులను ఆటంక పరచవద్దని సజావుగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డబ్బు, మద్యం పంపిణీకి దూరంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేసులు నమోదైయితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆయన హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ వాసు, పోలీసు సిబ్బందితో పాటు గుండ్లపాలెం, వరగాని గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికులతో చర్చలు జరిపాం

- హైకోర్టుకు నివేదించిన అదానీ గంగవరం పోర్టు
- కౌంటర్ వేసేందుకు సమయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లా అధికారుల సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరిపామని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం హైకోర్టుకు నివేదించింది. ఈ సమావేశానికి సంబంధించి పూర్తి వివరాలను న్యాయస్థానం ముందు ఉంచామని సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ కోర్టుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ సి.సుమన్ స్పందిస్తూ... పోర్టు యాజమాన్యం సమర్పించిన వివరాలను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలుకు సమయమివ్వాలని అభ్యర్థించారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య విచారణను మే 2వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు వ్యాజ్యంలో ఇంప్లీడ్ అవుతూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు వేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయమూర్తి అనుమతించారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ రాష్ట్రంలో విద్యుత్తు వాడకం కూడా బాగా పెరిగింది. ఈ నెల 20వ తేదీ నుంచి 29వ తేదీ దాకా పది రోజులపాటు పెరిగిన విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకునేందుకు బహిరంగ మార్కెట్లో రూ.287.65 కోట్లు పెట్టి కరెంటును డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. విద్యుత్తు అవసరాల కోసం కొంటున్న కరెంటు భారం విద్యుత్తు వినియోగదారులపైనే పడనుంది.

17 మంది వలంటీర్ల రాజీనామా... టీడీపీలో చేరిక

టెక్కలి, ఏప్రిల్ 30: 'ఐదేళ్ల పాటు మాతో గొడ్డుసేవలు చేయించుకుని ఇప్పుడేమో రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కొందరు వైసీపీ నేతలు తమ వింటారా, లేదా అని ఎదురుప్రశ్నలు వేస్తున్నారు. వైసీపీ నాయకుల నియంతృత్వ ధోరణి మధ్య మేం ఉండలేం. మేమంతా మూకుమ్మడిగా రాజీనామా చేసి స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నాం' అని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన 17మంది వలంటీర్లు ప్రకటించారు. అనంతరం, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ కావడంతో ఆయన వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పుకొన్నారు.

అధికారం కోసం జగన్ అడ్డదారులు: వర్ల

జగన్‌రెడ్డికి కూటమితో తలపడే ధైర్యం లేక, అడ్డదారులు తొక్కైనా అధికారం నిలబెట్టుకోవాలని చూస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో వర్ల రామయ్య విమర్శించారు. అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాజుగ్లాసు గుర్తును జనసేన పార్టీకే కేటాయించాలని హైకోర్టు ఆదేశాలివ్వగా ఇండిపెండెంట్ అభ్యర్థులకూ గాజుగ్లాసు గుర్తును కేటాయించేలా కుట్రలు చేస్తున్నారు. పుంగనూరును ప్రత్యేక సామ్రాజ్యంగా భావిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి మనుషులు టీడీపీ ప్రచార రథాలు తిరగకుండా, తగలబెడుతున్నారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకూ పెద్దిరెడ్డి మనుషులే కావడంతో చోద్యం చూస్తున్నారు. బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్‌పై దాడులు చేసినా పోలీసులు తమాషా చూస్తున్నారు. పరిస్థితులు కాస్త అటుఇటూ అయితే సీఎం అవుదామని పెద్దిరెడ్డి ఉబలాటపడుతున్నాడు. పుంగనూరులో ఏ ఆదేశాలు ఇవ్వలేని దుస్థితిలో సీఎస్, డీజీపీ ఉన్నారు' అని విమర్శించారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

- రొంపిచర్ల కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. చిత్తూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్‌కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా రొంపిచర్ల బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించానని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్‌పీ సుమంత్ వాదనలు వినిపించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రస్తుత కేసులో ఎన్నికలతో సంబంధంలేని ఎంపీడీవో ఫిర్యాదు చేశారన్నారు. నిర్ధిష్ట సమయానికి ముందే పిటిషనర్ సమావేశాన్ని ముగించారన్నారు.

భారత్ సూపర్‌గా ఎదిగితే పాక్ అడుక్కుంటోంది!

- ఆ దేశ పార్లమెంటులో విపక్ష నేత వ్యాఖ్య

ఇస్లామాబాద్, ఏప్రిల్ 30: సూపర్ పవర్‌గా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంటే పాకిస్థాన్ నిధుల కోసం అడుక్కుంటోందని విపక్ష నేత మౌలానా ఫజులుర్ రహ్మాన్ వ్యాఖ్యానించారు. జమాత్ ఉలేమా ఎ ఇస్లాం (ఫజల్) పార్టీ నాయకుడైన ఆయన మంగళవారం పార్లమెంటు ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. దేశ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ "1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. ఇవాళ భారత దేశం ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేస్తోంది. మనం మాత్రం దివాళా పరిస్థితి నుంచి బయటపడేందుకు పోరాటం చేస్తున్నాం. ఇంతగా అంతరం ఉండడానికి కారకులు ఎవరు?" అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల తీరుపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఇవేమి ఎన్నికలు? ఓడిన వారు అసంతృప్తిలో ఉండడం...గెలిచిన వారిలోనూ సంతోషం కనిపించకపోవడం..ఇదేమి పరిస్థితి?" అని అన్నారు. ఎక్కువ సీట్లు పొంది ఉంటే పాకిస్థాన్ తెహరీక్ ఇన్సాఫ్ పార్టీకే అధికారాన్ని అప్పగించి పదవి నుంచి తప్పుకోవాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను సూచించారు. "ప్రజలకు అవసరమైన చట్టాలు చేయలేని నిస్సహా స్థితిలో ఉన్నాం. ఇన్ని ఆంక్షలు ఉన్నప్పుడు దీన్ని ప్రజల పార్లమెంటు అనొచ్చా? ఇదేమి ప్రజాస్వామ్యం?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో అప్పటి ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను గద్దె దింపడానికి జరిగిన పాకిస్థాన్ డెమొక్రాటిక్ మూమెంట్ ఉద్యమంలో ఫజల్ కీలకంగా వ్యవహరించడం గమనార్హం. చరిత్రలో ఎప్పుడూ లేనంత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు సోమవారమే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) రుణాన్ని విడుదల చేయడం గమనార్హం. మొత్తం 3 బిలియన్ డాలర్ల (సుమారు 25వేల కోట్ల భారత రూపాయలు) రుణాన్ని మంజూరు చేయగా తొలి విడతగా 1.1 బిలియన్ డాలర్లు (సుమారు 9వేల కోట్ల భారత రూపాయలు) విడుదల చేసింది. రుణం మంజూరు చేసే ముందు సబ్సిడీలు తగ్గించాలని, కరెంటు ఛార్జీలు, పన్నులు పెంచాలని షరతులుగా విధించింది. మరోవైపు తీసుకున్న విదేశీ రుణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితికి కూడా పాకిస్థాన్ చేరుకుంది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

● పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్

నరసరావుపేట రూరల్, ఏప్రిల్30: జిల్లాలో ని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక, అత్యం త సమస్యాత్మక, సాధారణ అనేవిధంగా విభజించామని దానికి తగ్గట్టు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యాత్మక పోలింగ్ కేంద్రలపై ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నరసరావుపేట పరిధిలో ఉన్న జేఎన్టీయూలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను మంగళవారం జిల్లా ఎస్పీ బిందుమాదవ్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరలో జరగ నున్న సార్వత్రిక ఎన్నికలు -2024 దృష్ట్యా ప్రజలు ఓటు హక్కును ప్రశాంత వాతావర ణంలో స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తు న్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శావల్యా పురం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వేల్పూరు, పొట్లూరు, మతుకుపల్లి, కారు మంచి, కొత్తలూరు గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ బిందుమాదవ్ సంద ర్శించి అక్కడ భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు నరసరావు పేట డీఎస్పీ వర్మ, వినుకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, నరస రావుపేట రూరల్ సీఐ మల్లికార్జునరావు, శావల్యాపురం ఎస్ఐ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, మతుకుమల్లి, కారుమంచి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు.

మహిళా కార్యకర్తలే మహారాణులు

- స్త్రీశక్తి, మహిళా మిత్రలతో నారా బ్రాహ్మణి

దుగ్గిరాల, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీలో ఎప్పటికీ మహిళా కార్యకర్తలే మహారాణులని నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో స్త్రీశక్తి, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళలు రాజకీయాల్లోనూ మరింతగా రాణించగలరని గుర్తించే ఎన్టీఆర్ వారికి పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించారన్నారు. ఎన్టీఆర్ సంక్షేమానికి కొనసాగింపుగా మహిళల ఆర్థిక స్వావలంబనకు చంద్రబాబు డ్వాక్రాలకు శ్రీకారం చుట్టి వారి స్థితిగతులను మార్చివేశారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ద్వారా శిక్షణ తీసుకుని ఉపాధి పొందామని, తద్వారా కుటుంబానికి ఆర్థికంగా తమ వంతు సాయం అందిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ.. టీడీపీ విజయం కోసం ప్రచారం చేయడానికి విదేశాల నుంచి సొంతూళ్లకు వచ్చామని తెలిపారు. అనంతరం దుగ్గిరాలలో పసుపు మిల్లును నారా బ్రాహ్మణి పరిశీలించారు. పసుపు ఎలా తయారు చేస్తారో అక్కడి మహిళా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు విన్నారు.



పసుపు ఫ్యాక్టరీలో మహిళా కార్మికులతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

అమెరికాలో విద్యార్థులపై ఉక్కుపాదం!

- పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతున్న వర్సిటీలు
- వెయ్యిమందిని అరెస్టు చేసినా.. వెనక్కి తగ్గని విద్యార్థులు
- కొలంబియా, కార్నెల్ వర్సిటీల్లో పలువురు విద్యార్థుల సస్పెన్షన్

న్యూయార్క్, ఏప్రిల్ 30: అమెరికాలోని యూనివర్సిటీలు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతూనే ఉన్నాయి. ఎన్ని హెచ్చరికలు చేసినా విద్యార్థులు లెక్కచేయడంలేదు. క్యాంపస్‌లలో టెంట్లు వేసుకొని రోజుల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పోలీసులను రంగంలోకి దించి వందలాదిమందిని అరెస్టు చేసినా, విద్యార్థులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో అరెస్టుల సంఖ్య వెయ్యికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో నిరసనకారులపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నారు. కొలంబియా యూనివర్సిటీలో మంగళవారం కూడా విద్యార్థులు సుమారు 120 టెంట్లలో భైఠాయించి నిరసనలు కొనసాగించారు. ప్రవేశద్వారానికి అడ్డంగా మానవహారం నిర్వహించారు. హాస్టళ్లలోని కిటికీల నుంచి పాలస్తీనా జెండాలను ఊపుతున్నారు. ఆందోళనలు విరమించడానికి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు డెడ్‌లైన్ విధించిన కొలంబియా, కార్నెల్ యూనివర్సిటీలు.. ఆ తర్వాత పలువురు విద్యార్థులను సస్పెండ్ చేశాయి. తక్షణమే వర్సిటీని వీడాలని, హాస్టల్ భవనాలనూ ఖాళీ చేయాలని వారిని ఆదేశించాయి. అమెరికా వ్యాప్తంగా మిగిలిన యూనివర్సిటీల్లో మంగళవారం కూడా పలువురు విద్యార్థులను అరెస్టు చేశారు.

సస్పెన్షన్‌తో వసతి కూడా ఖాళీ..

అమెరికాలోని యూనివర్సిటీల్లో సస్పెండ్ అయిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ లేదా సెమిస్టర్ పూర్తి చేయడానికి అనర్హులవుతారు. వారిని తరగతులకు, పరీక్షలకూ అనుమతించరు. వర్సిటీ అనుబంధ హాస్టళ్లలో వారు వసతి కూడా కోల్పోతారు. వారిని అకడమిక్ భవనాల్లోకి కూడా అనుమతించరు. గ్రాడ్యుయేషన్ చేయడానికీ వారు అర్హత కోల్పోతారు. ఈ మేరకు కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో నోటీసు అంటించారు. కార్నెల్ యూనివర్సిటీలోనూ అలాంటి నోటీసునే అంటించారు. ఒకసారి క్రమశిక్షణ చర్యలకు గురైతే, వారిపై వర్సిటీలోని వివిధ విభాగాలు విచారణ జరుపుతాయని కొలంబియా యూనివర్సిటీ ప్రజాసంబంధాల విభాగం ఉపాధ్యక్షుడు బెన్ చాంగ్ తెలిపారు. యూనివర్సిటీ లైఫ్ కార్యాలయం, యూనివర్సిటీ సెనేట్ కార్యాలయం క్రమశిక్షణ చర్యల ప్రక్రియను చేపడతాయని వివరించారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన పలువురు విద్యార్థులు తమను హాస్టల్ నుంచి కూడా పంపించేశారని స్థానిక మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాము ఎక్కడ నివసించాలంటూ విలపిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన విదేశీ విద్యార్థుల వీసాలు కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని ఆటార్నీ రాధికా సాయినాథ్ తెలిపారు.

భారతీయ విద్యార్థులు.. తల్లిదండ్రుల్లో ఆందోళన..

తాజా పరిస్థితి విదేశీ విద్యార్థులపై, ప్రత్యేకించి భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్యాంపస్‌లో తరగతుల నిర్వహణకు అవాంతరాలు కలుగుతుండటంతో కొలంబియా యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు ఆన్‌లైన్ బోధన చేపట్టాయి. దీంతో భారతీయ విద్యార్థులు తమ భవితవ్యంపై ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై స్వదేశంలోని వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు. నిరసనల్లో పాల్గొని అరెస్టయినవారిలో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. దీంతో వారి వీసా, స్కాలర్‌షిప్‌లకు కూడా ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు నెలకొన్నాయి. 'విదేశీ విద్యార్థులు మూడు స్థాయిల్లో అమెరికా చట్టాలను, విధానాలను పాటించాలి. అమెరికా ఫెడరల్ చట్టానికి, రాష్ట్ర చట్టానికి వారు కట్టుబడి ఉండాలి. యూనివర్సిటీలు రాష్ట్ర చట్టం పరిధిలోకి వస్తాయి. ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతోపాటు విద్యాసంస్థ విధానాలకూ వారు కట్టుబడి ఉండాలి. ఇందులో ఏ స్థాయిలోనైనా అతిక్రమణకు పాల్పడితే 'విద్యార్థి హోదా'నే అతిక్రమించినట్టు భావించి.. వారిని అమెరికా నుంచి పంపించేసే అవకాశం కూడా ఉంది' అని ఇమ్మిగ్రేషన్.కాం మేనేజింగ్ అటార్నీ రాజీవ్ ఖన్నా పేర్కొన్నారు.

అమెరికాను వీడాల్సిందే!

ఎఫ్-1 వీసాపై చదువుకొంటున్న విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉండాలంటే తప్పనిసరిగా 'విద్యార్థి హోదా'ను కాపాడుకోవాలి. విద్యాసంస్థ నుంచి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైన విద్యార్థుల ఎఫ్-1 వీసాకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. 'ఒకసారి విద్యార్థి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైతే, సెవీస్(స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో ఆ విద్యార్థి అడ్మిషన్‌ను విద్యాసంస్థ తప్పనిసరిగా తొలగించాలి. అదే జరిగితే ఎఫ్-1 లీగల్ హోదాను ఆ విద్యార్థి కోల్పోయినట్టే' అని లాక్వెస్ట్ మేనేజింగ్ పార్టనర్ పూర్వి చోతని తెలిపారు. ఆ పరిస్థితుల్లో విద్యార్థి తక్షణమే అమెరికాను వీడాల్సి ఉంటుందన్నారు. విద్యాసంస్థ నుంచి తొలగింపునకు గురైనవారికి గ్రేస్ పీరియడ్ కూడా ఉండదని చెప్పారు. అలాంటివారు 180 లేదా అంతకంటే ఎక్కువ రోజులు చట్టవిరుద్ధంగా అమెరికాలోనే ఉన్నట్లైతే.. తిరిగి వారు అమెరికాలోకి ప్రవేశించకుండా మూడేళ్లు నిషేధం విధిస్తారని తెలిపారు. చట్టవిరుద్ధంగా 12 నెలలకుపైబడి అమెరికాలో నివసించిన వారిపై ఈ నిషేధం పదేళ్ల వరకూ విధిస్తారని చెప్పారు. విద్యార్థితోపాటు ఎఫ్-2 హోదా ద్వారా అమెరికాలో నివసిస్తున్న విద్యార్థి జీవిత భాగస్వామి, పిల్లలపైనా ఈ తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. హింసాత్మక ఆందోళనల్లో అరెస్టయిన విద్యార్థుల వీసా రద్దయ్యే అవకాశం ఉందని, దీంతో వారు అమెరికాను వీడాల్సి ఉంటుందని తెలిపారు. 'వీసాతో వచ్చి అమెరికాలో నివసించేవారు ఆందోళనల్లో పాల్గొంటే గనుక, వారి వీసాల రెన్యువల్ సమయాల్లో సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. యూనివర్సిటీ గ్రాంట్స్, తద్వారా వారి స్కాలర్‌షిప్‌పైనా ప్రభావం పడే అవకాశం ఉంది' అని ఖైతాన్ అండ్ కో లీడర్‌షిప్ అండ్ రివార్డ్స్ డైరెక్టర్ ప్రతీక్ గాంధీ తెలిపారు.

వైసీపీకి గుంటూరు డిప్యూటీ మేయర్ రాజీనామా

- నేడు టీడీపీలో చేరనున్న సజీల
- కార్పొరేటర్లపై అధికార పార్టీ నిఘా



టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు ముందు అధికార పార్టీ వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. మొన్నటి వరకు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే ఆరుగురు కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరగా తాజాగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి వైసీపీ నేత షేక్ షౌకత్‌లు ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం, వారిద్దరూ టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో బుధవారం ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. తూర్పు నియోజకవర్గంలో కీలక నేత, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని ఇటీవల నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన గత రెండు ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కృషి చేశారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే సుభానితో పాటు తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్‌తో పాటు వైసీపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టీ, షేక్ మీరావలి, వేముల జ్యోతిలు టీడీపీలో చేరారు. పశ్చిమ నియోజకవర్గంలో కూడా ముగ్గురు కార్పొరేటర్లు వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఇటీవల టీడీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ వెంట వైసీపీ కార్పొరేటర్ శ్రీవల్లి కూడా వెళ్లారు. అనంతరం 23వ డివిజన్ కార్పొరేటర్ సాధు ఉమామహేశ్వరి, భర్త రాజేశ్, 19వ డివిజన్ కార్పొరేటర్ హనుమాయమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇటీవల టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్‌లు తమకు టచ్‌లో ఉన్నారని, త్వరలోనే చేరేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు తెలిపారు. దీంతో కంగారు పడిన వైసీపీ.. కార్పొరేటర్‌లపై నిఘా పెట్టింది. ఏ కార్పొరేటర్లు పార్టీని వీడేలా ఉన్నారు? ఏం ఆశించి వెళుతున్నారు.. వంటి వివరాలు సేకరిస్తోంది. అదేసమయంలో కార్పొరేటర్ల కదలికలపై కీలక నేతలు ఆరా తీస్తున్నారు. కార్పొరేటర్ల కదలికలను గుర్తించేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిసింది.

'రెడ్‌బుక్' విచారణ 15కు వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మే 15వ తేదీకి వాయిదా వేసింది. లోకేశ్ తరఫున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. ఇందుకు కొంత సమయం కావాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోరగా, విచారణను న్యాయాధికారి మే 15వ తేదీకి వాయిదా వేశారు.

డీప్‌ఫేక్ వీడియో కేసు.. కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ, ఆప్ నేత అరెస్టు

- రేవంత్‌కు సమన్లివ్వడం.. తెలంగాణ ప్రజలను అవమానించడమే
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్
- మన్మోహన్ ఫేక్ వీడియోలపై ఏం చేశారని ప్రశ్న
- నిజామాబాద్ పసుపుబోర్డు వాగ్దానం ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో కేసులో ఓ ఎమ్మెల్యే పీఏ, మరో ఆప్ నేత అరెస్టయ్యారు. ఇప్పటికే ఈ కేసులో గువాహటికి చెందిన అసోం కాంగ్రెస్ ఎన్నికల వార్‌రూమ్ సమన్వయకర్త సోమవారం రీతంసింగ్ అరెస్టవ్వగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా.. నలుగురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం మరో 12 మందికి నోటీసులు పంపారు. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ పీఏ, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచరుడు సతీశ్‌వన్సోలాను, దావోద్ జిల్లా ఆప్ అధ్యక్షుడు ఆర్బీ వారియాను అరెస్టు చేసినట్లు ఢిల్లీ సైబర్ సెల్ అధికారులు వెల్లడించారు. వీరిద్దరికీ వాట్సాప్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో చేరిందని, వారు ఉద్దేశపూర్వకంగా ఆ వీడియను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారని చెప్పారు. డీప్‌ఫేక్ వీడియోను ఎవరు ఎడిట్ చేశారనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. తన పీఏ అరెస్టుపై ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ స్పందించారు. తన పీఏ పొరపాటున ఆ వీడియోలను షేర్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఆ వీడియో ఫేక్ అని అతనికి తెలిసి ఉండదన్నారు. బీజేపీనే చాలా కాలంగా ఫేక్ వీడియోలను వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. దానిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. డీప్‌ఫేక్ వీడియోను సృష్టించిన వారిని కాకుండా.. పొరపాటున షేర్ చేసిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

రేవంత్ అంటే మోదీకి భయం: జైరాం రమేశ్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అంటే ప్రధాని మోదీకి భయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. రేవంత్‌కు సమన్లు పంపడం అంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఇది నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికలపై దాడేనని ఎక్స్‌లో ఆరోపించారు. "మాజీ ప్రధాని మన్మోహన్ డీప్‌ఫేక్ వీడియోలు బీజేపీ సృష్టించింది. ఆ వీడియోలను సర్క్యులేట్ చేస్తోంది. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో బీజేపీ పేలవమైన ప్రదర్శనతో నిరాశకు లోనై.. బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తున్న రేవంత్‌ను ప్రధాని మోదీ భయపెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించే రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం మోదీకి అలవాటేనని విమర్శించారు. తెలంగాణ కూడా కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు.. ఆ రాష్ట్రానికి 43 పైసలు మాత్రమే దక్కుతోందని గుర్తుచేశారు. పసుపు ఎగుమతుల్లో సుమారు 30% వాటాను తెలంగాణ అందిస్తోందని పేర్కొంటూ.. నిజామాబాద్ పసుపుబోర్డుపై మోదీ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు.

బీజేపీకి 180 సీట్లు దాటవు: మాణిక్కం ఠాకూర్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 180 సీట్లు దాటవని కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. తెలంగాణలో మోదీ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని.. బీజేపీపై అసమ్మతి పెరగడం వల్లే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా.. తెలంగాణ ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు.



విజయవాడలో సమావేశమైన హజ్ కమిటీ

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

- అధికారులకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆదేశం
- బెజవాడలో మొదటి సన్నద్ధత సమావేశం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నిర్దేశించారు. 2024-హజ్ యాత్ర మొదటి సన్నద్ధత సమావేశాన్ని మంగళవారం విజయవాడలోని ముసాఫిర్ ఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ హజ్‌యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికిగాను ఇప్పటి వరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 728 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,118 మంది, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 725 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది బయలుదేరనున్నారని పేర్కొన్నారు. మే 26 నుంచి జూన్ 9 మధ్య విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌యాత్రకు బయలుదేరానున్నారని తెలిపారు. హజ్‌యాత్రికులకు గన్నవరం సమీపంలోని మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మదరసా వద్ద టెంట్లు, ఎయిర్ కూలర్లు సిద్ధం చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రత చర్యల్లో భాగంగా మహిళా పోలీసులను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా విమానాశ్రయ అధికారులు సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. యాత్రికులను మదరసా నుంచి గన్నవరం విమానాశ్రయానికి పంపించేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతుందన్నారు. మదరసా వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కోరామన్నారు. హజ్‌యాత్రలో సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని, అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం

- అభ్యంతరాలు ఉంటే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించండి
- మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 329(బి) కోర్టుల జోక్యాన్ని నిరోధిస్తుందన్నారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచిస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ తీర్పు ఇచ్చారు. నారాయణ తన నామినేషన్ పత్రాలలో భార్య వివరాలు ప్రస్తావించాల్సినచోట రెండో భార్య వివరాలను పొందుపర్చలేదని, తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా నామినేషన్‌ను ఆమోదించారని పేర్కొంటూ నెల్లూరుకు చెందిన న్యాయవాది దేశాయ్‌శెట్టి హనుమంతురావు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం స్పౌజ్ కాలమ్‌లో భార్యకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చాలన్నారు. నారాయణ తన రెండో భార్య ఇందిర వివరాలను నామినేషన్ పత్రాలలో ప్రస్తావించలేదన్నారు. తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, తగిన నిర్ణయాన్ని వెల్లడించేలా రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలని కోరారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలి తప్ప రిట్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల ప్రక్రియ మధ్యలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేశారు.

కూటమి మేనిఫెస్టోపై ఉద్యోగుల్లో జోష్

- ప్రతి నెలా 1నే జీతాలు, ఫించన్లు హామీపై హర్షం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అధికార వైసీపీ, కూటమి మేనిఫెస్టోల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ఆ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. వైసీపీ మేనిఫెస్టోలో ఏమీ లేదంటూ ఇప్పటికే ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. దానికంటే ఎన్డీయే కూటమి మేనిఫెస్టో బెటర్ అని అంతర్గత చర్చల్లో అంగీకరిస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఆశాజనకంగా ఉన్నాయని చెబుతున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో.. గత ఐదేళ్లుగా జీతాలు, పింఛన్లు సకాలంలో అందక అనుభవించిన నరకయాతనను తల్చుకొని ఊపిరి పీల్చుకుంటున్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు వచ్చే ఐదేళ్లలో ముఖ్యమైన హామీలేమీ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. జగన్ సర్కారు సకాలంలో వేతనాలు చెల్లించలేదని, డీఏలు ఇవ్వకుండా రూ.వేల కోట్లు బకాయి పెట్టిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని స్పష్టం చేస్తున్నారు.

పీఆర్సీపై ఆశాభావం

ఉద్యోగులకు సకాలంలో పీఆర్సీ ఇస్తామని, అదేవిధంగా అధికారంలోకి రాగానే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటిస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పారు. జగన్ సర్కారు ఉద్యోగులకు బకాయిపడిన రూ.25వేల కోట్లకుపైగా మొత్తాన్ని కొత్త ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలన్నీ చెల్లిస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు దేశంలో మొట్టమొదటిసారిగా ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ ఇచ్చింది చంద్రబాబేనని, ఇప్పుడు సీపీఎస్ అంశంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటాననే హామీ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తానని హామీ ఇవ్వడంపైనా ఉద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది.

కాపులకు జగన్ మోసం!

- రాష్ట్ర కాపు జేఏసీ నాయకుల ధ్వజం



అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న కాపు జేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30: జగన్ సర్కారు కాపులను దారుణంగా మోసం చేసిందని రాష్ట్ర కాపు సంఘాల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, రామ్మూర్తి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కాపులను వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ కాపులను వెన్నుపోటుపొడిచారని మండిపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కింద 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో కాపు వర్గాల విద్యార్థులు నష్టపోయారన్నారు. కాపులకు ప్రత్యేకంగా ఏడాదికి రూ.2వేల కోట్ల చొప్పున ఐదేళ్లల్లో రూ.10 వేలకోట్లు ఖర్చు పెడతామని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చి, కేవలం రూ.1,490 కోట్లు ఖర్చుపెట్టారని విమర్శించారు. ఏ ఒక్కరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో విదేశీ విద్యకు అర్హులైన పిల్లలకు దశలవారీగా రూ.15 లక్షలు చెల్లించారని, వైసీపీ పాలనలో అన్ని పథకాలనూ రద్దు చేశారని మండిపడ్డారు. కాపులంతా ఏకమై ఎన్డీయే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.





చంద్రబాబు కాన్వాయ్ ముందు తెలుగు యువత స్వాగత ర్యాలీ





సభకు హాజరైన అశేష ప్రజానీకానికి అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

తెనాలిలో చంద్రబాబుకు ఘన స్వాగతం



అభిమానులకు చంద్రబాబు అభివాదం

తెనాలి రూరల్, ఏప్రిల్ 30: మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు తెనాలి రాకతో జన ప్రభంజనంగా మారింది. దారిపొడవునా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజాగళం పేరిట మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా తెనాలిలో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. సాయంత్రం 7గంటల సమయంలో హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లోని హెలిప్యాడ్ వద్దకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేరుకున్నారు. అక్కడ ఆయనకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, బీజేపీ రాష్ట్ర నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్నీ క్రిష్టినా, సురేష్‌కుమార్ దంపతులు, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ ప్రాంగణం నుండి రోడ్డుషోగా బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సుల్తానాబాద్ ప్రధాన రోడ్డుమార్గం నుంచి భారీ సంఖ్యలో ఉమ్మడి పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రోడ్డు మొత్తం వేలాది మంది వాహనాలతో కిక్కిరిసిపోయింది. దారిపొడవునా చంద్రబాబుకు మహిళలు హారతులు పట్టి దిష్టితీశారు. సుల్తానాబాద్ వద్ద అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, రావి చిన్ని ఆధ్వర్యంలో పువ్వులు, పుచ్చకాయలతో ప్రత్యేకంగా తయారుచేయించిన భారీ గజమాలతో చంద్రబాబును సత్కరించి స్వాగతం పలికారు. మార్కెట్ యార్డు సమీపంలో గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో నిమ్మకాయలతో ప్రత్యేకంగా తయారుచేయించి భారీ గజమాలను చంద్రబాబుకు వేసి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. చెంచుపేట వద్ద రాజానాయక్ ఆధ్వర్యంలో పసుపురంగు నూలుతో తయారు చేసిన భారీ గజమాలతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. అక్కడి నుండి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మీదుగా ఆలపాటి వారధికి చంద్రబాబు కాన్వాయ్ చేరింది. అక్కడి నుండి గంగానమ్మపేట గుడి మీదుగా మార్కెట్‌లోని సభాప్రాంగణానికి చంద్రబాబు చేరారు. అక్కడ వేలాదిగా చంద్రబాబు కోసం ఎదురుచూస్తున్న ప్రజనీకాన్ని చూసి చంద్రబాబువారికి అభివాదం చేశారు.

చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరికలు

మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీ పార్టీ వీడి పలువురు టీడీపీలోకి చేరారు. ప్రజాగళం సభకు తెనాలి విచ్చేసిన చంద్రబాబును హెలిప్యాడ్ వద్ద మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌ల సమక్షంలో షేక్ సాహీర్, సొపాటి కిరణ్, కొలకలూరు నాగేశ్వరరావు, బండ్లమూడి బాస్కర్, దానబోయిన ప్రసాద్, జి. రమేష్, అత్తోట ప్రసాద్, రమేష్ తదితరులు పార్టీలో చేరారు. వారిని మాజీ సీఎం చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

చంద్రబాబుకు వీరవల్లి మురళి పుష్పగుచ్ఛం

తెనాలి రూరల్, ఏప్రిల్ 30: మాజీ ముఖ్యమంత్రి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడికి అంగలకుదురు గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి ఘనస్వాగతం పలికారు. తెనాలి సుల్తానాబాద్‌లో చంద్రబాబుకు ప్రత్యేకంగా పుష్పాలు, పుచ్చకాయలతో అలంకరించిన భారీగజమాలను ఆయనకు వేసి తెనాలికి స్వాగతం పలికారు. చంద్రబాబు పుష్పగుచ్ఛం అందించేందుకు భారీ సంఖ్యలో ప్రజలు ఉండటంతో ఆయనను కాన్వాయ్ వద్దకు పిలిచి ఆప్యాయంగా పలకరించి పుష్పగుచ్ఛం అందుకున్నారు. సీనియర్ నాయకుడిగా చంద్రబాబు వద్ద మురళికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో అతడిని గుర్తించి యోగక్షేమాలు విచారించారు. కనగాల నాగభూషణం, రావిచిన్ని, గణేష్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలపాటి త్యాగాన్ని గుర్తుపెట్టుకుంటా: చంద్రబాబు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పొత్తుల్లో భాగంగా తన సీటును త్యాగం చేయాల్సి వచ్చింది.. నా మనిషి రాజా. ఆయనను వదులుకోనని.. చంద్రబాబు తెలిపారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, టీడీపీ ఇన్‌చార్జి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల సారధ్యంలో తెనాలి ప్రాంతాన్ని నెం1గా తీర్చిదిద్దుకుందామన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ అవినీతికి తావులేకుండా సొంతగడ్డ రుణం తీర్చుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆయన గెలుపుతో ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందనుందని చెప్పారు.

జగన్ గ్రామ సింహం: పెమ్మసాని

జగన్‌మోహన్‌రెడ్డి సింహం సింగిల్‌గా వస్తుందని సినిమా డైలాగులు చెబుతున్నాడు.. సింహం పోలీసులను వెంటపెట్టుకుని, పరదాలు కట్టుకుని రాదు.. పచ్చని చెట్లను నరుక్కుంటూ రాదు.. జగన్ సింహం అనుకుంటున్నాడు అయితే అది గ్రామసింహం అయి ఉండవచ్చని ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఒంటరినని, తన వెనుక ఎవ్వరూ లేరంటున్నాడు.. దేశంలో ఇన్ని రాజకీయ పార్టీలు ఉండి కూడా వైసీపీకి మద్దతు తెలిపే సాహసం చేయడం లేదంటే జగన్ పార్టీపై ఏ ఒక్కరికీ నమ్మకంలేదని తెలుసుకోవాలన్నారు. ఒంటరిగా ఉన్న జగన్ రాజదాని కట్టలేదని, పోలవరం నిర్మించలేదని, రోడ్లు వేయలేడు అభివృద్ధి చేయలేడన్నారు. ఇలాంటి ఒంటరి జీవికి రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్, చంద్రబాబులు పొత్తు రాష్ట్ర అభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసమేనన్నారు. ముస్లిం మైనార్టీలకు ఎక్కడా కూడా అన్యాయం జరగనియ్యమని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వైసీపీ సోషల్ మీడియా అసత్య ప్రచారాలు చేస్తూ ముస్లిం మైనార్టీలలో అలజడి సృష్టిస్తోందని దానిని నమ్మవద్దన్నారు. ప్రతి ఇంట్లో ఒక్కరైనా చైతన్యవంతులుగా ఉంటూ వైసీపీ అరాచకపాలనను వివరించాలన్నారు. ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదేళ్లలో జగన్ భ్రష్టుపట్టించాడన్నారు. మద్యం, గంజాయి మత్తుతో యువత బంగారు భవిష్యత్తు చిత్తుగా మారిందని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో అమరావతి రాజధానిగా దినదినాభివృద్ధి చెందుతుంటే జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడి అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. చంద్రబాబు పాలనలో ధరలు, జగన్ పాలనలో ధరల వ్యత్యాసాన్ని తెలుసుకోవాలన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రంలో ప్రజలు బతకలేరని తెలిపారు. తెనాలి నుంచే వైసీపీ పతనం ప్రారంభం కావాలన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరవల్లి మురళి





చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, గోగినేని ఉమ, చంద్రబాబుకు జ్ఞాపికను అందిస్తున్న నన్నపనేని రాజకుమారి



చంద్రబాబు చిత్రపటానికి ఓ యువకుడి పాలాభిషేకం



పొన్నూరు వార్డుల్లో జరిగిన ప్రచారంలో పాల్గొన్న ముస్లింలు

ముస్లింలు వ్యతిరేకించే చట్టాలకు వైసీపీ మద్దతు

● టీడీపీ మైనార్టీ సెల్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 30: ముస్లింలు వ్యతిరేకిస్తున్న చట్టాలకు పార్లమెంట్‌లో ఆమోదం తెలిపింది వైసీపీయేనని టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫైరోజ్‌ఖాన్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని 20, 21, 22 వార్డులో టీడీపీ ముస్లింలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కూటమి విజయం అవశ్యకత గురించి తెలియజేశారు. పలువురు మాట్లాడుతూ జగన్ మాయమాటలతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. బీజేపీతో ఐదేళ్లుగా అంటకాగింది వైసీపీయేనని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో ఎంపీలు ఎక్కువగా ఉన్నప్పటికీ ముస్లింలు వ్యతిరేకించే సీఏఏ, ఎన్నార్సీ, సివిల్ కోర్టు చట్టాలకు ఆమోదం తెలపటంలో వైసీపీ అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. ముస్లింల రిజర్వేషన్లు తొలగించాలని కోర్టుకు వెళ్లింది వైసీపీ రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్యేనన్నారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానని జగన్ మాట తప్పారని ఆరోపించారు. దుల్హన్ పథకం నిలిపివేసి తర్వాత ఆంక్షలతో పథకం పెట్టి పేద ముస్లింలకు అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్‌అహ్మద్‌ఖాన్, మహ్మద్ గౌస్, కరిముల్లా బాజి, ఖాదర్‌జానీ, జాని బేగ్, షేక్ బాజ్జీ, బాజి సాహెబ్, షేక్ మగ్బుల్‌బేగ్, షేక్ హుస్సేన్, మయూరి అబ్దులా తదితర ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబటి అవినీతిని ప్రజల ముందు ఉంచుతాం

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 30: సత్తెనపల్లిలో అంబటి మురళీకృష్ణ సాగించిన అవినీతి దందాల నిజస్వరూపాన్ని ప్రజల ముందు ఉంచుతామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. చింతలపూడి డీవీసీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కమల్‌హాసన్‌కు మించిన నటుడు అంబటి మురళీకృష్ణ అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టులు మున్సిపల్ పనులు, కాంప్లెక్స్‌ల లీజులలో అంబటి సాగించిన అరాచకాలు, ఆగడాలు అక్కడి ప్రజలందరికీ తెలుసుఅన్నారు. అన్న రాంబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాజ్యాంగేతర శక్తిగా మారి మురళీకృష్ణ పెత్తనం సాగించారని ధ్వజమెత్తారు. సత్తెనపల్లి మున్సిపాలిటీలో జరిగే టెండర్లు, సొంత మనుషులతో వేయించి ఇతరులను అడ్డుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. మున్సిపల్, ప్రభుత్వ ఆసుపత్రులు, పారిశుధ్య కాంట్రాక్టుల్లో కూడా దూరి సొంత మనుషులకు ఇప్పించుకొని పేద కార్మికుల పొట్టకొట్టారని ఆరోపించారు. వావిలాల కాంప్లెక్స్‌కు సంబంధించిన షాపులు సింగిల్ పాటదారులకు కట్టబెట్టలేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో అనధికారికంగా అధికారులతో సమీక్షలు జరిపి పాలన గుప్పెట్లో పెట్టుకున్నారని ఆరోపించారు. అధికారుల పోస్టింగ్‌లో సైతం అంబటి మురళీదే నిర్ణయాధికారం అన్నారు. ప్రసన్నం చేసుకోని అధికారులను తరిమివేసి కావలసిన వారికి పదోన్నతులు అవార్డులు ఇచ్చారని ఆరోపించారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరఫరా చేసిన క్వారంటైన్ బెడ్‌లు, మంచాలు, అమ్ముకుని జేబులు నింపుకున్న ఘన చరిత్ర అంబటిది అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికలలో కిలారి రోశయ్యకు అంబటి మురళీకృష్ణకు ప్రజలే తగురీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పొన్నూరులో జరిగిన ముఖ్యమంత్రి సభ చూసిన తర్వాత పొన్నూరులో వైసీపీ ఓడిపోతుందని ఆ పార్టీ నాయకులకే అర్థమైందన్నారు. వైసీపీకి ఓటువేస్తే చెత్తబుటలో వేసినట్లేనని ప్రజలు నిర్ణయించుకునట్లు చెప్పారు. నాయకులు వాడుతున్న భాషా, వ్యవహారశైలి ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. అధికారం అనే అహంతో వ్యక్తిగతమైన అంశాలపై మాట్లాడుతున్న కిలారి రోశయ్యకు తగురీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. అలాగే సామాజికవర్గాల విషయాలు మాట్లాడుతున్న అంబటి మురళి వ్యాఖ్యలు కుల విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపించారు. 1967 నుంచి ధూళిపాళ్ళ కుటుంబం అంటే పొన్నూరు రాజకీయాలో సర్పంచ్ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగామని ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. సిద్ధాంతాలు, విలువల ప్రకారం తాము రాజకీయాలు చేస్తామని చెప్పారు. వెయ్యి ఏనుగులనైనా ఎదుర్కొనే శక్తి తనకు ఉందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల కాలంగా వెంటాడి వేధించినా, ధైర్యంగా ఎదుర్కొన్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పొన్నూరు వచ్చి తనపై ఒక మాట కూడా మాట్లాడలేదు అంటే అది తన నిజాయితీకి నిదర్శనం అన్నారు. సీఎం సభకు ప్రజలు రాకపోవంతోనే పొన్నూరులో కూటమి విజయం ఖాయం అయ్యిందని నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీరు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలి

అధికారపక్ష, విపక్ష సభ్యుల డిమాండ్

● సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం





వార్డు సమస్యపై అధికారులను నిలదీస్తున్న వైసీపీ కౌన్సిలర్ కోటేశ్వరావు, కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 30: పట్టణంలోని అన్ని వార్డులలో తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించటం లేదని, వార్డులోని వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేదని సమస్యలను పరిష్కరించాలని అధికారపక్ష, విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. తెనాలి కౌన్సిల్ సాధారణ, ప్రత్యేక సమావేశాలు మంగళవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. ఉదయం 12 గంటలకు సాధారణ సమావేశం మొదలయితే, దీనికి సంబంధించిన 3వ అంశంపై చర్చ జరుగుతుండగా 15వ వార్డు స్వపక్ష కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు మాట్లాడుతూ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని, సంబధిత అధికారులకు ఫోను చేస్తే స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ మెంబర్‌కే స్పందించకుంటే, సామాన్యుడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల సమాధానంతో సంతృప్తి చెందకపోవడంతో మున్సిపల్ కమిషనర్ కలగజేసుకొని ఎవరు ఫోనులో సమస్యను తెలిపినా వెంటనే సమస్యను పరిష్కరించేటట్లు ఆర్డర్ పాస్ చేస్తానన్నారు. ఇదేఅంశం వద్ద 22వ వార్డు వైసీపీ కౌన్సిలర్ దుబాయిబాబు మాట్లాడుతూ ఆర్భాటంగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు గాని తాగునీరు పాదచారులకు అందించడంలేదని అధికారులను నిలదీశారు. కమిషనర్ శేషన్న సమాధానమిస్తు త్వరలోనే తాగునీటిని పాదచారులకు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ 4వ వార్డు కౌన్సిలర్ తమ వార్డులో తాగునీరు రెండు పూటల సరఫరా చేయడంలేదని, చివరి ఇళ్లకు తాగునీరు అందడంలేదని తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సమాధానమిస్తూ పట్టణంలోని కొన్ని వార్డులలో రోజుకు రెండుపూటలా, కొన్ని వార్డులలో ఒకసారి మాత్రం తాగునీరును సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికార, విపక్ష కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నంబూరు పొలాలకు లిఫ్ట్ ద్వారా నీరందిస్తాం

● మాజీ మంత్రి దేవి ఉమామహేశ్వరరావు

పెదకాకాని, ఏప్రిల్ 30: నంబూరు గ్రామ రైతులు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకొని లిఫ్ట్ ద్వారా పంట పొలాలకు నీరు అందిస్తామని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పష్టంచేశారు. మంగళవారం పెదకాకాని మండలం నంబూరు గ్రామంలోని మహమ్మద్ రఫత్ కాలనీ, ఎస్సీ అంబేద్కర్ నగర్, బీసీ ఏరియా, విజయ భాస్కర్ నగర్, ఓసి రెడ్డి ఏరియా, ముస్లిం ఏరియాలలోని ప్రజానికంతో ముఖాముఖి (కార్నర్) సమావేశంలో హాజరైనా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. రైతులు టీడీపీ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, దూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ల పలు సమస్యలు విన్నవించారు.

వెనిగండ్లలో టీడీపీలో చేరిక



దేవినేని ఉమా, నరేంద్ర కుమార్‌లకు సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న నంబూరు వాసులు

పెదకాకాని, ఏప్రిల్ 30: పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, పంచాయతీ వార్డు నెంబర్ లు మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వరరావు, దూళిపాళ్ల నరేంద్ర కుమార్ల సమక్షంలో టీడీపీలో చేరారు.



బీవీ ప్రసాదరావును సత్కరిస్తున్న సిబ్బంది

క్రీడలతో మానసిక ఉత్తేజం: ప్రసాదరావు

పెదకాకాని, ఏప్రిల్ 30: క్రీడలు మానసిక ఒత్తిడిని దూరంచేసి ఉత్తేజాన్ని కలిగిస్తాయనీ, మనోవేగాన్ని నియంత్రించే శక్తి క్రీడలకు ఉంటుందని ఇండియన్ వాలీబాల్ మాజీ చీఫ్ కోచ్ బీ.వి.ప్రసాదరావు అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు ఆయన పురస్కారాలు, ప్రశంశా పత్రాలను అందించారు. కళాశాల నుంచి జేఎన్.టి.యూ. కాకినాడ స్పోర్ట్స్ టోర్నమెంట్ జట్లకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ముఖ్య అతిథి బి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. మనలోని చెడును బయటకు పంపి మంచిని పెంచేలా క్రీడలు మనల్ని నియంత్రిస్తాయని తెలిపారు. క్రీడలకు దూరంగా ఉండటం వల్ల విద్యార్థులు శారీరక ఆకృతికి కోల్పోతున్నారని అన్నారు. క్రీడలు మానసిక సంతోషం కోసం ఆడాలని సూచించారు. ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ క్రీడలు చదువులో భాగమనీ, క్రీడలను విద్యార్థులకు తప్పనిసరి అని తెలిపారు. క్రీడలలో విజేతలుగా నిలచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రములో అకడమిక్స్ డీన్ కె. గిరిబాబు, డీన్ కె. సత్యనారాయణ, అడ్మిన్ డీన్ ఎన్. కుమారస్వామి, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్. అరుణ్ కుమార్, ఎమ్.గిరిధర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 30: శ్రీశ్రీ కవిత్వం ఆధునికమే కాదు.. అభ్యుదయమైనదని ఈ యుగ కవిత్వ నుడికారాన్ని అందించారని సహజ కవి అయినాల మల్లేశ్వరరావు చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో మంగళవారం శ్రీశ్రీ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరసం అధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీ సాహిత్యాన్ని చర్చించారు. శ్రీశ్రీ సినీపాటల ప్రస్థానాన్ని నటుడు విజయసారథి వివరించారు. ప్రేమ్‌కుమార్, నాగమణి, కృష్ణ తదితరులు ప్రసంగించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి: ఆదాయ పన్ను మాజీ కమిషనర్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 30: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆదాయ పన్ను శాఖ మాజీ కమిషనర్ భూపాల్‌రెడ్డి కోరారు. గాంధీచౌక్‌లో ఓటు విలువ వివరిస్తూ మంగళవారం ప్రదర్శన చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 90 శాతం పైగా పోలింగ్ జరిగినప్పుడే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో వజ్రాల రామలింగాచారి, కృష్ణారావు, పురుషోత్తమరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బొంతు నాగిరెడ్డికి సత్కారం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 30: నాజరుపేట పశు వైద్యశాలలో అంకిత భావంతో పశు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బొంతు నాగిరెడ్డిని మంగళవారం సన్మానించారు. సత్యం శివం సుందరం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, టి.శివశంకర్, నరేంద్ర, హేమకుమార్, శంకర్, షఫీ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసైనికులపై తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి: వీరెళ్ల

పెదకాకాని, ఏప్రిల్ 29: జనసైనికులపై తప్పుడు ప్రచారాన్ని వైసీపీ నాయకులు మానుకోవాలని పెదకాకాని మండలం జనసేన పార్టీ అధ్యక్షులు వీరేళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పెదకాకాని మండల జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొప్పురావూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమిశెట్టి పాండు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరెళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొప్పురావూరు గ్రామంలోని జనసేన కార్యకర్తలపై అధికార పార్టీకి చెందిన పత్రికలో తప్పుడు కథనాన్ని ప్రచురించారన్నారు. కొప్పురావూరులో జనసేన కార్యకర్తలు వైసీపీలో 150 కుటుంబాలు చేరాయన్న వార్త అవాస్తవం అన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 30: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. జాస్తి చంద్రశేఖర్, మనోరమ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా, యు రామకోటయ్య, సాంబ్రాజ్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఉప్పలపాటి షణ్ముఖేశ్వరావు, మహాక్ష్మి దంపతుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, ప్రజలకు పంపిణీ చేశారు.

కఠెవరంలో సాయిబాబాకు ప్రత్యేకపూజలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని కఠెవరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. కోపల్లె రోడ్డులోని నాగసాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయిబాబాకు కాకడ హారతి, సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, సామూహిక సాయిసత్యవ్రత, చందనోత్సవం, భజనలు, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.